## ఖమ్మం జిల్లాలో కారును ఢీకొన్న లారీ..

ఖమ్మం: ఖమ్మం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సోమవారం తెల్లవారుజామున తల్లాడ మండలం అంజనాపురం గ్రామ సమీపంలో ఎదురెదురుగా వస్తున్న కారు, లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.సమాచారం అందుకున్న వెంటనే తల్లాడ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. లారీ వేగంగా ఢీకొనడంతో కారు నుజ్జునుజ్జయ్యింది. దీంతో అతి కష్టం మీద మృతదేహాలను బయటకు తీసి, పోస్టుమార్గం నిమిత్తం మార్చురీకి తరలించారు. క్షతగాత్రులను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. మృతులను జఫర్‌గఢ్‌కు చెందిన చిల్లర బాలకృష్ణ (కారు డ్రైవర్), రాయల అనిల్‌గా గుర్తించారు.క్షతగాత్రులను అజయ్, కొల్లిపాక కాంతి, గట్టు రాకేశ్‌గా నిర్ధారించారు. వీరిది స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఉప్పుగల్లు అని పోలీసులు తెలిపారు. వీరంతా ఒడిశాలోని పూరి జగన్నాథ స్వామి దర్శనం చేసుకుని తిరిగొస్తుండగా ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :262 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది:మంగళవారం 30-12-2025 | పేజీలు:4 వెల: 2.00


## తొలి రోజునే రభసా..ముందంతా రచ్చరచ్చనే



హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు తొలి రోజునే రభసతో సాగాయి. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. రాష్ట్రంలో చెక్ డ్యామ్ లను బాంబులు పెట్టి పేల్చేస్తున్నారని ఆయన ఆరోపించారు. గతంలో ఎన్నికల లబ్ధి కోసం కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ బ్యారేజీని పేల్చినట్లే..నా హుజురాబాద్ నియోజకవర్గంలోని తనుగుల చెక్ డ్యామ్ ను పేల్చేశారని, ఇప్పుడు అదే తరహాలో చెక్ డ్యామ్ ను పేల్చేశారని ఆరోపించారు. కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై అధికార పక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య తీవ్ర వాగ్వివాదంతో సభలో కొంతసేపు గందరగోళం నెలకొంది. ఇదే సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడేందుకు స్పీకర్ గడ్డం ప్రసాద్ అవకాశం కల్పించడంతో ఆ వివాదానికి బ్రేక్ పడింది.యూరియా యాప్‌తో రైతులు ఆగమాగం అవుతున్నారని. యాప్ లేకుండా యూరియా పంపిణీ చేయాలని ప్రభాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు కేవలం 9 గంటలే ఇస్తోందని, ట్రాన్స్‌ఫార్మర్స్, పోల్స్, కరెంట్ వైర్లు కావాలని రైతులు అడిగితే.. బడ్జెట్ లేదని అధికారులు చెప్తున్నారని ఆరోపించారు.మాజీ మంత్రి టి.హరీష్ రావు మాట్లాడుతూ రెండేళ్లయినా ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్నారని ప్రభుత్వంపై విమర్శలు చేశారు. తక్షణమే ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు, పోలీసులకు ఇచ్చిన హామీ ప్రకారం బకాయిలు విడుదల చేయాలని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కను డిమాండ్ చేశారు.మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ భీంగల్ వంద పడకల ఆస్పత్రి పనులు దాదాపు 85 శాతం పనులు కూడా పూర్తయ్యాయని పేర్కొన్నారు. రూ.5 కోట్లు విడుదల చేస్తే మిగిలిన పనులు పూర్తవుతాయని చెప్పారు. నిధులు విడుదల చేసి పెండింగ్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

**భాష హుందాగా ఉండాలి : బీజేపీ ఎమ్మెల్యే కాటెపల్లి**

శాసన సభ లోపల, బయట మాజీ సీఎం కేసీఆర్, సీఎం రేవంత్ రెడ్డి సహా రాజకీయ నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యులు అభ్యంతరకర భాషను వినియోగిస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే కాటెపల్లి వెంకటరమణారెడ్డి ఆందోళన వెలిబుచ్చారు. మన రాజకీయ నాయకుల వల్లే బయట కొందరు గౌరవం లేకుండా మాట్లాడుతున్నారు. కొత్తగా ఎన్నికైన సభ్యులు గౌరవ మర్యాదలతో మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. ఫ్యూచర్ లో సభకు వచ్చే సభ్యులకు మనం ఆదర్శంగా ఉండాలే ప్రస్తుత నాయకుల భాష ఉండాలని ఆకాంక్షించారు. చాలా మంది సీఎం, మాజీ సీఎం, ప్రధాని పట్ల అగౌరవంగా మాట్లాడుతున్నారన్నారు. చిన్ననాటి మిత్రులు, క్లాస్మేట్స్ తో సంబోధించినట్లు సంభోదిస్తున్నారని తెలిపారు. సభలో అర్థవంతమైన విమర్శలు, ప్రతివిమర్శలతో చర్చలు కొనసాగించాలని కోరారు.స్పందించిన శాసన సభా వ్యవహారా మంత్రి డి.శ్రీధర్ బాబు రాజకీయాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు హుందాకరమైన భాషతో మాట్లాడటం ద్వారా ఆదర్శంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. సభలో చర్చల సందర్భంగా సభ్యులు అంతా గౌరవ ప్రదమైన భాషను వినియోగించాలని కోరుతున్నామన్నారు.

## ఫిరాయింపు ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్‌లో డోర్స్ క్లోజ్

హైదరాబాద్,డిసెంబర్ 29: అసెంబ్లీ శీతాకాల సమావేశాల వేళ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎటూ కాకుండా పోయారని విమర్శించారు. వారు ఏ పార్టీలో ఉన్నారో కూడా చెప్పుకోలేకపోతున్నారని అన్నారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్‌లో డోర్స్ క్లోజ్ అయ్యాయని స్పష్టం చేశారు. ఫిరాయించిన ఎమ్మెల్యేల స్థానంలో కొత్తవారికి అవకాశమిస్తామని కేటీఆర్ తెలిపారు. గ్రౌండ్‌లో బీఆర్ఎస్‌కు మంచి పట్టు ఉందని అన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలిందని పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 40 శాతం ఫలితాలు వచ్చాయని గుర్తుచేశారు. పాలమూరు-రంగారెడ్డి విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి రంధ్రాన్వేషణ వల్ల రాష్ట్రానికే నష్టమని కేటీఆర్ అన్నారు. అనుమతులు దృష్టిలో ఉంచుకుని తాగునీటి పేరుతో పనులు చేశామని చెప్పారు. కేసీఆర్ చిత్తశుద్ధిని కాళేశ్వరం విషయంలో చూడాలన్నారు. మీడియాతో ఇష్టాగోష్ఠిలో కేటీఆర్ మాట్లాడారు. రేవంత్‌రెడ్డి దోపిడీని అడుగడుగునా అడ్డుకుంటున్నందుకే దూషిస్తున్నారు. ఆయన తిట్లు నాకు దీవెనలు. నన్ను తిడితే పడతాను కానీ.. కేసీఆర్‌ను అంటే ఊరుకునేది లేదు. ఆయనకు మంచి పేరు వస్తుందనే పాలమూరు-రంగారెడ్డి పనులు చేయట్లేదు. కాల్వల కోసం పిలిచిన టెండర్లను రేవంత్ ప్రభుత్వం రద్దు చేసింది. గోదావరిలో నీటి హక్కుల కోసమే కాళేశ్వరం అదనపు టీఎంసీ పనులను కేసీఆర్ చేపట్టారని కేటీఆర్ అన్నారు. పార్టీని వదిలి వెళ్లిన నేతలను మళ్లీ తీసుకోవాల్సిన అవసరం లేదన్నది తన అభిప్రాయమని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఆర్ఎస్‌ను కాదని భాజపాలోకి వెళ్లిన నేతల నియోజకవర్గాల్లో ఎన్ని సర్పంచ్ స్థానాలు గెలిచారో చూశాం కదా! నేతల బలం లేకున్నా మా కార్యకర్తలు సర్పంచ్‌లను గెలిపించుకున్నారు. 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారని న్యాయస్థానంలో పోరాడుతున్నాం.. వారితో మాకేం సంబంధం?వారి విషయంలో సీఎం మాటలు విడ్డూరంగా ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల నాటికి, సర్పంచ్ ఎన్నికల నాటికి పరిస్థితులు చాలా మారాయి. అందుకే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెట్టడం లేదు. ఫైనాన్స్ కమిషన్ నిధుల కోసమే తప్పనిసరి పరిస్థితుల్లో మున్సిపల్ ఎన్నికలు అంటున్నారు. ప్రజల్లో ప్రభుత్వ పరిస్థితి బాగోలేదు. కడియం నా గురించి ఏం మాట్లాడతారు? వాస్తవాలు దాచలేరు కదా! పోచారం ఈ వయసులో ఏం సాధించారు? గౌరవం నిలబెట్టుకోవాలి కదా అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. మాజీ సీఎం కేసీఆర్‌ను సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో పలకరించడంపై కేటీఆర్ స్పందించారు. తెలంగాణ తెచ్చిన నాయకుడిగా కేసీఆర్ పట్ల తెలంగాణలో ఉన్న ప్రతి ఒక్కరికి గౌరవం ఉంది. ముఖ్యమంత్రి సభలో కేసీఆర్‌ను కలిసేంత సంస్కారం ఉంటే చాలు. ఇదే సంస్కారం బయట మాటల్లో ఉంటే బాగుంటుంది. రాజకీయ ప్రత్యర్థులు ఒకరినొకరు పలకరించుకునేంత సానుకుల వాతావరణం ఉంటే మంచిదేనని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

**ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ చేయట్లేదా..**

ఫోన్ ట్యాపింగ్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు.



ముఖ్యమంత్రికి ఇంటెలిజెన్స్ వస్తుందని తెలిపారు. గూఢచారి వ్యవస్థ తొలి ప్రధాని నెహ్రూ నుంచి నేటిదాకా ఉందని గుర్తుచేశారు. శాంతి భద్రతలు, రాష్ట్ర రక్షణ కోసం ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారని తెలిపారు.అసెంబ్లీలో మీడియాతో కేటీఆర్ చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆయన స్పందించారు. ఇవాళ నిఘా వ్యవస్థ లేదా.. ఫోన్ ట్యాపింగ్ నడుస్తలేదా అని ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకుల ఫోన్లు ట్యాపింగ్ చేయడం లేదా అని ప్రశ్నించారు. ట్యాపింగ్ నిజమైతే అధికారులు ఎందుకు ప్రెస్‌మీట్ పెట్టడం లేదని అడిగారు. ఇప్పుడు డీజీపీ కూడా అప్పుడు అధికారిగా ఉన్నారని గుర్తుచేశారు. ఆయనకు కూడా నిఘా వ్యవస్థ గురించి అన్ని తెలుసని చెప్పారు. నిఘా వ్యవస్థ ఏవిధంగా పనిచేస్తుందో ముఖ్యమంత్రికి అధికారులు చెప్పరని అన్నారు. వారికి ఉన్న నిబంధనల మేరకు, వారికి సమాచారం ఏవిధంగా వస్తుందో ముఖ్యమంత్రి అడగరని చెప్పారు. ఈ సిట్ వంటి డ్రామాలతో ప్రజల దృష్టిని ఎన్నిరోజులు మరలుస్తారని ప్రశ్నించారు. ఈ అటెన్షన్ డైవర్షన్‌తో ఎన్నిరోజులు కాలం వెల్లదీస్తారని నిలదీశారు. ఇన్నిరోజులు సిట్, విచారణ, కేసుల పేరుతో సాధించిందేంటని ప్రశ్నించారు. కనీసం ఒక్క దాంట్లో అయినా నిజం తెలిసిందా అని అడిగారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న డైవర్షన్లను ప్రజలు గమనిస్తున్నారని కేటీఆర్ తెలిపారు. అందుకే ప్రజలు సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేశారని అన్నారు. కాంగ్రెస్‌కు పరిపాలన రాదని ప్రజలకు తెలిసిపోయిందని తెలిపారు. కాంగ్రెస్ అప్పుల ప్రచారాన్ని కూడా ప్రజలు నమ్మడం లేదని పేర్కొన్నారు. కాగ్ లెక్కల నిజాలు కూడా ప్రజలకు తెలుసని అన్నారు. 24 నెలల్లో చేసిన రెండున్నర లక్షల కోట్ల అప్పుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించారు.పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుపై అసెంబ్లీ చర్చ జరపాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎవరు ఏ ప్రాజెక్టులు కట్టినా తాగునీటి అవసరాల పేరుతోనే ప్రాజెక్టులు కట్టడం ప్రారంభిస్తారని తెలిపారు. ఆ తర్వాతనే అన్ని అనుమతులు తీసుకురావడం ఆనవాయితీ అని, కానీ ఈ విషయాన్ని ఎవరూ చెప్పరని వివరించారు. పోలవరం ప్రాజెక్టు గురించి 70 ఏండ్లుగా వింటున్నాం.. కానీ ఇంకా అది పూర్తి కాలేదని అన్నారు.

## కెసిఆర్ ఎందుకు వెళ్లారో..ఆయననే అడగండి

హైదరాబాద్,డిసెంబర్29: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ నుంచి ఎందుకు వెళ్లిపోయారో తెలీదని.. ఈ ప్రశ్న ఆయననే అడగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ లాబీలో మీడియా ప్రతినిధులకు సీఎం ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా అసెంబ్లీ నుంచి కేసీఆర్ వెళ్లిపోవడంపై ముఖ్యమంత్రిని జర్నలిస్టులు ప్రశ్నించారు. అలాగే ప్రతిపక్ష నేత కేసీఆర్‌తో ఏం మాట్లాడారని వారు అడిగారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. కేసీఆర్, తాను మాట్లాడుకున్నది మీకెందుకు చెబుతామని చమత్కరిస్తూ సమాధానం ఇచ్చారు.అంతేకాకుండా అసెంబ్లీకి వచ్చిన వెంటనే కేవలం 5 నిమిషాల్లోనే కేసీఆర్ ఎందుకు వెళ్లిపోయారో ఆయన్నే అడగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఇక.. అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో మంత్రులు, ప్రభుత్వ విప్‌లతో సీఎం రేవంత్ భేటీ అయ్యారు. అసెంబ్లీలో తమ స్టాటజ్రీపై నేతలకు ముఖ్యమంత్రి దిశానిర్దేశర చేయనున్నారు.




మరికాసేపట్లో బీఏసీ సమావేశం జరుగనుంది. అసెంబ్లీ పనిదినాలను బీఏసీ ఖరారు చేయనుంది.

## బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడి.. తీవ్రంగా ఖండించిన అసదుద్దీన్ ఒవైసీ




హైదరాబాద్,బంగ్లాదేశ్‌లో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలపై AIMIM పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.మైనారిటీల రక్షణతో పాటు ప్రాంతీయ స్థిరత్వం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఇక, బంగ్లాదేశ్‌లో దీపు చంద్ర దాస్, అమృత్ మండల్ హత్యలను తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది అన్నారు. ఈ విషయంలో భారత్-బంగ్లాదేశ్ అర్థవంతమైన చర్చలు కొనసాగేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఎంఐఎం పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన తెలిపారు. అలాగే, బంగ్లాదేశ్ సెక్యులర్, బంగ్లా జాతీయవాద పునాదులపై ఏర్పడిన దేశం, అక్కడ సుమారు 2 కోట్ల మంది ముస్లిమేతర మైనారిటీలు నివసిస్తున్నారని అసదుద్దీన్ ఒవైసీ గుర్తు చేశారు.ఇక, భారత్-బంగ్లాదేశ్ మధ్య ఉద్రిక్తతలు పెరగకూడదని ఆకాంక్షిస్తున్నాను.. అక్కడి ప్రభుత్వం మైనారిటీల రక్షణకు కట్టుబడి ఉండాలని ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ సూచించారు. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ మైనారిటీల భద్రతకు కట్టుబడి ఉంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌లో శాంతి అత్యంత అవసరం, ముఖ్యంగా భారత్ లోని ఈశాన్య రాష్ట్రల భద్రతకు అది కీలకం అన్నారు. అయితే, ఐఎస్ఐ, చైనా వంటి దేశాలు భారత్‌కు శత్రుత్వం ఉండటం ఆందోళన కలిగిస్తోందని హెచ్చరించారు. అదే సమయంలో భారత్‌లో కూడా జరుగుతున్న హింసాత్మక ఘటనలపై ఒవైసీ తీవ్రంగా మండిపడ్డారు.

## ఆరావళిపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు..



న్యూఢిల్లీ,ఆరావళి పర్వతాల్లో గనుల తవ్వకాలపై సుప్రీంకోర్టు తాజాగా కీలక ఆదేశాలు జారీ చేసింది. గతంలో ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధించింది. స్థానిక భూమి ఉపరితలం నుంచి 100 మీటర్లు లేదా అంతకుమించి ఎత్తున ఉన్నవి మాత్రమే ఆరావళి పర్వతాలుగా పరిగణించబడతాయని, అంతకన్నా తక్కువ ఎత్తున ఉన్నవి ఆరావళి పర్వత శ్రేణుల పరిధిలోకి రావంటూ గతనెల సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ తీర్పుపై పెద్ద ఎత్తున దుమారం రేగింది. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దేశవ్యాప్తంగా నిరసనలకు దారి తీసింది.ఈ నేపథ్యంలో ఈ వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించిన సుప్రీం ధర్మాసనం.. గత నెల ఇచ్చిన తన ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ , జె.కె. మహేశ్వరి, ఎ.జి. మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఈ అంశాలను పరిశీలించడానికి కొత్త నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. అంతేకాదు, ఈ అంశంపై సుమోటోగా దాఖలైన కేసుపై స్పందించాలని కేంద్ర ప్రభుత్వానికి, ఆరావళి రాష్ట్రాలైన రాజస్థాన్, గుజరాత్, ఢిల్లీ, హర్యానాకు కోర్టు నోటీసులు జారీ చేసింది. అనంతరం తదుపరి విచారణను వచ్చే ఏడాది జనవరి 21కి వాయిదా వేసింది.

**ఆరావళిపై సుప్రీం తీర్పు..**

ఈ ఏడాది అక్టోబర్ 13న కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వశాఖ ఆరావళి పర్వతాలకు కొత్తగా 100 మీటర్ల నిర్వచనాన్ని సుప్రీంకోర్టు వద్ద ప్రతిపాదించిన విషయం తెలిసిందే. మంత్రిత్వశాఖ అందచేసిన 100 మీటర్ల నిబంధన సిఫార్సును సుప్రీంకోర్టు నవంబర్ 20న ఆమోదించింది. అయితే, సుప్రీం తీర్పుపై పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చింది. ఆరావళిపై తన నిర్ణయాన్ని పునః పరిశీలించాలని కోరుతూ న్యాయవాది, పర్యావరణ కార్యకర్త జితేంద్ర గాంధీ భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)కి సోమవారం లేఖ రాశారు.ఎత్తు ప్రాతిపదికన పర్వతాన్ని నిర్ణయించడం వల్ల అనాలోచితంగా అది వాయువ్య భారతదేశం వ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణను బలహీనపరుస్తుందని రాష్ట్రపతికి కూడా పంపిన తన లేఖలో జితేంద్ర పేర్కొన్నారు. సుప్రీం తీర్పుతో ఆరావళి పర్వత శ్రేణుల్లో 90 శాతం పర్వతాలు రక్షణను కోల్పోతాయని, మైనింగ్, రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు విచ్చలవిడిగా సాగి పర్యావరణ విధ్వంసం జరుగుతుందని, థార్ ఎడారి ఢిల్లీ వరకు విస్తరించి భూగర్భ జలాల రీచార్జ్ నిలిచిపోవడంతోపాటు జీవ వైవిధ్యం దెబ్బతింటుందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు.

## చైనీస్ మాంజ వినియోగం, విక్రయంపై నిషేధం

నల్లగొండ, డిసెంబర్ 29 : నల్లగొండ జిల్లాలో చైనీస్ మాంజ (నైలాన్/ప్లాస్టిక్ పూతతో తయారు చేసిన ప్రమాదకర దారం) వినియోగం, నిల్వ, విక్రయాలపై పూర్తిస్థాయి నిషేధం అమలులో ఉందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఈ నిషేధాన్ని ఉల్లంఘించే వ్యాపారులపై ఎలాంటి సడలింపు లేకుండా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చైనీస్ మాంజ కారణంగా చిన్నపిల్లలు, యువకులు, పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర గాయాలకు గురవుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని, ముఖ్యంగా మెడ, ముఖం, చేతులకు ప్రాణాంతక గాయాలు సంభవిస్తున్నాయని తెలిపారు. అదేవిధంగా పక్షులు, విద్యుత్ తీగలు, ప్రజా ఆస్తులకు కూడా భారీ నష్టం జరుగుతోందన్నారు.చైనీస్ మాంజ విక్రయాలు పూర్తిగా అరికట్టేందుకు జిల్లాలోని అన్ని మండలాలు, పట్టణాలు, గ్రామాల్లో ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి, దుకాణాలు, గోదాములు, తాత్కాలిక స్టాళ్లు, రహస్య నిల్వలు అదేవిధంగా ఆన్‌లైన్ విక్రయాలపై జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తనిఖీల్లో చైనీస్ మాంజ విక్రయాలు లేదా నిల్వలు బయటపడితే మాంజను వెంటనే స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, అవసరమైతే అరెస్టులు కూడా చేస్తామని హెచ్చరించారు. అలాగే నిషేధాన్ని ఉల్లంఘించిన వ్యాపారుల లైసెన్సులు రద్దు చేయించడంతో



పాటు, దుకాణాలు, గోదాములను సీజ్ చేయడానికి రెవెన్యూ, మున్సిపల్ శాఖలతో సమన్వయ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చిన్నపిల్లలకు చైనీస్ మాంజ అందించినా, బహిరంగ ప్రదేశాల్లో చట్ట విరుద్ధంగా మాంజ ఎగరేసినా లేదా ప్రమాదాలకు కారణమైనా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చైనీస్ మాంజ విక్రయాలు జరుగుతున్నట్లు ఎక్కడైనా తెలిసిన వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ప్రజల ప్రాణ భద్రతే పోలీస్ శాఖకు ప్రధాన లక్ష్యమని,

## ఉన్నావ్ రేప్ కేసులో కీలక ఆదేశాలు.. బెయిల్‌పై స్టే విధించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఉన్నావ్ రేప్ కేసులో యూపీ ఎమ్మెల్యే కుల్దీర్ సింగ్ సెంగార్‌కు ఢిల్లీ హైకోర్టు జారీ చేసిన బెయిల్‌పై ఇవాళ సుప్రీంకోర్టు స్టే విధించింది. 2017లో ఉన్నావ్ రేప్ ఘటన జరిగిన విషయం తెలిసిందే. జీవితఖైదు శిక్షను రద్దు చేస్తూ ఢిల్లీ కోర్టు ఇచ్చిన ఆదేశాలను సీబీఐ సవాల్ చేసింది. అయితే ఆ కేసులో బీజేపీ నేత కుల్దీప్ సెంగార్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. డిసెంబర్ 23వ తేదీన ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం కుల్దీప్ సెంగార్‌ను కస్టడీ నుంచి రిలీజ్ చేయరాదు అని సుప్రీంకోర్టు ఇవాళ ఆదేశించింది.సెంగార్‌కు బెయిల్ ఇచ్చిన వైఖరిని సీబీఐ తన పిటీషన్‌లో తప్పుపట్టింది. అయితే తాజాగా సుప్రీం ఇచ్చిన ఆదేశాలతో కుల్దీప్ జైలులోనే కొనసాగనున్నారు. కుల్దీప్ సెంగార్‌కు ఢిల్లీ హైకోర్టు బెయిల్ ఇవ్వడంతో దేశవ్యాప్తంగా చర్చాంశంగా మారింది. తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. రేపిస్టులకు రక్షణలు కల్పించడాన్ని ఖండిస్తూ ప్లకార్డులు, నినాదాలతో గత శుక్రవారం హైకోర్టు ప్రాంగణం సమీపంలో నిరసనకారులు ప్రదర్శనలు నిర్వహించారు.ఉన్నావ్ అత్యాచార బాధితురాలికి మద్దతుగా నిర్వహించిన ఆనిరసన ప్రదర్శనలలో ఐద్వాకు చెందిన సభ్యులతోపాటు



సామాజిక కార్యకర్త యోగితా భావన, బాధితురాలి తల్లి తదితరులు పాల్గొన్నారు. తన కుమార్తె చాలా కష్టాలను ఎదుర్కొందని, ఇప్పుడు కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకించడానికే తాను వచ్చానని బాధితురాలి తల్లి మీడియాకు తెలిపారు.

## సంపాదకీయం

**మంగళవారం 30-12-2025**

# ఉజ్జ్వల భవితకు గ్రీన్ స్కిల్స్

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వేగంగా మారుతోంది. వాతావరణ మార్పులు, కర్బన ఉద్గారాల నియంత్రణ, పర్యావరణ బాధ్యత వంటి అంశాలు ప్రభుత్వ విధానాలు, కార్పొరేట్ వ్యూహాలు, పెట్టుబడుల నిర్ణయాలను కూడా ప్రభావితం చేస్తున్నాయి. భారత్ సహా ప్రపంచమంతా హరిత ఆర్థిక వ్యవస్థ (గ్రీన్ ఎకానమీ) వైపు అడుగులు వేస్తోంది. ఈ మార్పు భారత యువతకు ఉపాధిని పెంచుతుందా, అవకాశాలను తగ్గిస్తుందా అన్నది ఇప్పుడు కీలక ప్రశ్న. ప్రపంచవ్యాప్తంగా హరిత పరిశ్రమలకు సంబంధించిన ఉద్యోగాలకు డిమాండు ఎంతో వేగంగా పెరుగుతోందని 'లింక్డిన్' ఇటీవల విడుదల చేసిన 'గ్రీన్ స్కిల్స్ రిపోర్ట్' స్పష్టీకరిస్తోంది. అదే సమయంలో మనదేశంలో గిరాకీకి తగిన స్థాయిలో వృత్తి నిపుణులు లేరన్న విషయాన్ని అది గుర్తుచేస్తోంది. ప్రపంచమంతా హరిత సాంకేతిక మార్పుల దిశగా అడుగులు వేస్తున్న సందర్భంలో, నైపుణ్యాల కొరత మూలంగా కొత్త అవకాశాల్ని అందిపుచ్చుకోవడంలో భారతీయ యువత వెనకంజ వేసే ప్రమాదం ఉంది.

బహుళ రంగాల్లో ఉద్యోగాలు

గ్రీన్ ఉద్యోగాలు అంటే ఇప్పటికీ చాలామందికి సౌర ప్యానెల్ ఇంజినీర్లు, విండ్ టర్బైన్ టెక్నీషియన్లే గుర్తుకొస్తారు. గ్రీన్ ఉద్యోగాలు ఇప్పుడు బహుళ రంగాలకు విస్తరించాయి. ఈఎస్‌జీ అనలిస్టులు, సస్టెయినబిలిటీ కన్సల్టెంట్లు, క్లైమేట్ రిస్క్ మేనేజర్లు, కార్బన్ అకౌంటింగ్ నిపుణులు, గ్రీన్ ఫైనాన్స్ వృత్తినిపుణులు, సప్లై చైన్ సస్టెయినబిలిటీ మేనేజర్లు వంటి కొలువులు వేగంగా పెరుగుతున్నాయి. ఈ ఉద్యోగాలకు కేవలం పర్యావరణంపై అవగాహన సరిపోదు. ఫైనాన్స్, చట్టం, పాలసీ, డేటా అనలిటిక్స్ వంటి రంగాలపై సమగ్ర అవగాహన అవసరం. ఇక్కడే భారతదేశ విద్యా వ్యవస్థలోని లోపం బయట పడుతోంది. 'లింక్డిన్' నివేదిక ప్రకారం, విశ్వవిద్యాలయాల నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు ఈ నైపుణ్యాలతో సిద్ధంగా ఉండటం లేదు. చాలా భారతీయ కళాశాలలు ఇప్పటికీ సస్టెయినబిలిటీని ఒక ఐచ్ఛిక అంశంగానే చూస్తున్నాయి. ఇదంతా గ్రీన్ ఎకానమీ అవసరాలకు సరిపోదు. అలాగని మనదేశంలో పరిస్థితి పూర్తిగా నిరాశాజనకంగానే ఉందని చెప్పలేం. కొన్ని విద్యా సంస్థలు ఇప్పటికే మార్పును గుర్తించి ముందడుగు వేశాయి. దిల్లీలోని 'టెరి' స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ సంస్థ సస్టెయినబిలిటీ మేనేజ్‌మెంట్, క్లైమేట్ సైన్స్, పాలసీల్లో ఎంబీఏ కోర్సును అందిస్తూ గ్రీన్ స్కిల్స్ విద్యలో భారత్‌కు మార్గదర్శకంగా నిలుస్తోంది. మద్రాస్, దిల్లీ ఐఐటీలు, ఐఐఎస్సీ బెంగళూరు వంటి సంస్థలు రెన్యూవబుల్ ఎనర్జీ, క్లైమేట్ సైన్స్, సస్టెయినబుల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై శిక్షణ, పరిశోధన అందిస్తున్నాయి. బిజినెస్ విద్యలో కూడా మార్పు కనిపిస్తోంది. ఐఐఎం అహ్మదాబాద్, బెంగళూరు, డీవోఎంఎస్-నల్సార్, ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ వంటి ప్రముఖ బిజినెస్ స్కూల్స్ ఈఎస్‌జీ (ఎన్విరాన్‌మెంటల్, సోషల్ అండ్ గవర్నెన్స్), రెస్పాన్సిబుల్ బిజినెస్, సస్టెయినబుల్ ఫైనాన్స్ వంటి ఎలెక్టివ్ కోర్సులను ప్రవేశపెట్టాయి. టిస్, అశోకా యూనివర్సిటీ, ఒ.పి.జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీలు సస్టెయినబిలిటీ, పర్యావరణ పాలసీ, క్లైమేట్ గవర్నెన్స్‌పై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అయితే ఇలాంటివన్నీ కొద్దిమంది విద్యార్థులకే అందుబాటులో ఉండటం మరో సమస్య. గ్రీన్ స్కిల్స్ విషయంలో ఇతర దేశాలు ఎంతో ముందున్నాయి. హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో బిజినెస్ ఎన్విరాన్‌మెంట్ ప్రధాన అధ్యయనంగా ఉంది. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి వర్సిటీలు సస్టెయినబిలిటీ విద్యకు ప్రపంచ కేంద్రాలుగా గుర్తింపు పొందాయి. ఇన్‌సీడ్, యేల్ వంటి సంస్థలు ఎంబీఏలో సస్టెయినబిలిటీ, క్లైమేట్ ఫైనాన్స్, ఎనర్జీ ట్రాన్సిషన్ వంటి ప్రత్యేక కోర్సులను అందిస్తున్నాయి. ఈ సంస్థల్లో సస్టెయినబిలిటీ కీలకం. సంప్రదాయ పరిశ్రమల్లో కూడా గ్రీన్ స్కిల్స్ నిపుణుల అవసరం పెరుగుతోంది. తయారీ, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసులు, ఐటీ, కన్సల్టింగ్, స్థిరాస్తి వంటి రంగాల కంపెనీలు సస్టెయినబిలిటీ సంబంధిత నైపుణ్యాలను ఆశిస్తున్నాయి. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు గ్రీన్ ఫైనాన్స్, క్లైమేట్ రిస్క్ అసెస్‌మెంట్, ఈఎన్‌జీ రిపోర్టింగ్ నైపుణ్యాలు ఉన్న ఉద్యోగులను కోరుకుంటున్నాయి. ఐటీ, టెక్నాలజీ కంపెనీలు ఎనర్జీ ఎఫిషియెన్సీ, కార్బన్ ఫుట్‌ప్రింట్ మానిటరింగ్, సస్టెయినబుల్ డేటా సెంటర్లపై పనిచేసే నిపుణులను నియమించుకుంటున్నాయి. ఇలాంటి గ్రీన్ నైపుణ్యాలు ఉన్న ఉద్యోగులకు కెరీర్ అవకాశాలు విస్తృతమవుతున్నాయి. వేతనాలు కూడా ఇతర సాధారణ నైపుణ్యాల కంటే మెరుగ్గా లభిస్తున్నాయి.

యువతకు సంకేతం

గ్రీన్ స్కిల్స్ భవిష్యత్ ఉద్యోగ మార్కెట్‌కు కేంద్రబిందువుగా మారనున్నాయి. ఈ పరిణామాలు భారత యువతకు స్పష్టమైన సంకేతాన్నిస్తున్నాయి. ప్రపంచస్థాయి ఉద్యోగ మార్కెట్ హరిత నైపుణ్యాలకే ప్రాధాన్యం ఇస్తోంది. ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే విద్యా వ్యవస్థ, పరిశ్రమలు, ప్రభుత్వాలు సమష్టిగా కృషి చేయాలి. గ్రీన్ స్కిల్స్‌ను ప్రధాన విద్యలో భాగంగా చేయాలి. ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, లా, ఎకనామిక్స్ వంటి కోర్సులేవైనా- సస్టెయినబిలిటీ, క్లైమేట్ లిటరసీ తప్పనిసరి కావాలి. పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య బలమైన అనుసంధానం అవసరం. ఉద్యోగ మార్కెట్‌లో వస్తున్న మార్పులకు తగినట్లుగా సిలబస్ కూడా వేగంగా మారుతుండాలి. ప్రభుత్వ నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు గ్రీన్ రంగాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. యువత మారుతున్న మార్కెట్‌ను అర్థం చేసుకుని గ్రీన్ స్కిల్స్ నేర్చుకోవాలి. లింక్డిన్ నివేదికను మన దేశానికి ముందస్తు హెచ్చరికగా భావించాలి. భారత్ ఈ మార్పులకు నాయకత్వం వహిస్తుందా, నైపుణ్య లేమితో వెనకబడుతుందా... అనేది కాలమే నిర్ణయిస్తుంది.

# హిందువులు లక్ష్యంగా బంగ్లాలో దాడులు !




ఢాకా,బంగ్లాదేశ్‌లో అల్లర్లు భారత్‌ను రెచ్చగొట్టేలా సాగుతున్నాయా అన్న అనుమానం కలుగుతోంది. ఎందుకంటే యూనస్ తాత్కాలిక నేతగా పగ్గాలు చేపట్టిన తరవాత హిందువులు లక్ష్యంగా దాడులు పెరిగాయి. హసీనాను పదవీచ్యుతి చేసిన తరవాత హిందువులు లక్ష్యంగా దాడులు సాగుతున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే వందలమందిని హతమార్చారు. హసీనా భారత్‌లో తలదాచుకుంటున్న నేపథ్యంలో కావాలనే అక్కడి మైనార్టీ హిందువులపై దాడులు విపరీతం అయ్యాయి. రాజకీయ హింసలో భాగంగా వీటిని చూపే ప్రయత్నం చేసి తప్పించుకోవాలని చూస్తున్నారు. అయితే గత ఏడాదిగా అక్కడ జరుగుతున్న అల్లర్లు కేవలం హిందువులను ఊచకోత కోసేవిగా ఉన్నాయి. పనిగట్టుకుని మూకలు రెచ్చిపోతున్నా, తాత్కాలిక ప్రభుత్వం ప్రేక్షకపాత్ర వహిస్తోంది. ఈ క్రమంలో తాజాగా ఇద్దరు హిందువులను హతమర్చారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దారుణాలపై భారతదేశంలో ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవు తున్నాయి. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మూక దాడులను, హత్యలను సినీ ప్రముఖులు ఖండిస్తున్నారు. గాజాలో జరిగిన పరిణామాలను అయ్యో పాపం అనుకున్న భారతీయులు, పొరుగు దేశం బంగ్లదేశ్‌లో జరుగుతున్న పరిణామాలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా మౌనం వీడాలంటూ సోషల్ మీడియా వేదికగా కోరుతున్నారు. ఈ క్రమంలోనే హీరోయిన్లు జాన్వీపూర్, కాజల్ అగర్వాల్, సీనియర్ నటి, మాజీ ఎంపీ జయప్రద చేసిన పోస్టులు వైరల్‌గా మారాయి. బంగ్లాదేశ్‌లో రాజకీయ అనిశ్చితి కారణంగా ఆ దేశం రణరంగంగా మారిన సంగతి తెలిసిందే. అక్కడ ఇటీవల హిందువులపై వరుస దాడులు జరుగుతున్నాయి. తొలుత దీపుచంద్ర దాస్ అనే వ్యక్తిని దారుణంగా కొట్టి చంపి, అతని మృతదేహానికి నిప్పంటించిన ఘటన మురువకముందే తాజాగా మరో వ్యక్తిని కొట్టి చంపిన సంఘటన జరిగింది. అమృత్ మండల్ అలియాస్ సామ్రాట్ అనే వ్యక్తి రాజ్‌బరిలోని పంగ్షా ఉప జిల్లాలో హత్యకు గురయ్యాడు. సామ్రాట్ హత్య ఏ విధంగానూ మతపరమైనది కాదని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని బంగ్లాదేశ్ ప్రభుత్వం ఓ ప్రకటనలో పేర్కొంది. ఇది కేవలం హత్యను కప్పిపుచ్చుకోవడానికి చేసిన ప్రయత్నం తప్ప మరోటి కాదు. అయితే హిందువులపై జరుగుతున్న వరుస దాడులపై భారత్ తీవ్రంగా స్పందించింది. మైనారిటీ కమ్యూనిటీ సభ్యులను లక్ష్యంగా చేసుకుని ఇటీవల జరిగిన వరుస సంఘటనలను ఆందోళన కలిగించేవిగా అభివర్ణించింది. హిందువులపై ఇలాంటి హింసను విస్మరించలేమని భారత్ హెచ్చరించింది. సరిహద్దు వెంబడి జరుగుతున్న పరిణామాలను న్యూఢిల్లీ తీవ్రంగా పరిగణించిందని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. హిందువులపై జరుగుతున్న హింసను విదేశాంగ మంత్రిత్వ శాఖ ఖండించింది. బాధ్యులను గుర్తించి శిక్షిస్తారని ఆశాభావం వ్యక్తం చేసింది. బంగ్లాదేశ్‌లో ఇటీవలి పరిణామాల గురించి ప్రపంచమంతా గమనిస్తోంది. వాటిని నిశితంగా గమనిస్తున్నట్లు భారత్ కూడా పేర్కొంది. శాంతిభద్రతల పరిస్థితి విషయానికొస్తే అక్కడ ఏం జరుగుతుందో ఎప్పటి కప్పుడు భారత్ తెలియజేస్తున్నది. బంగ్లాదేశ్‌లోని హిందువులు, క్రైస్తవులు, బౌద్ధులు సహా మైనారిటీలపై జరుగుతున్న దాడులు ఆందోళన కలిగించే విషయమని జైస్వాల్ అన్నారు. మైమెన్‌సింగ్‌లో ఇటీవల జరిగిన హిందూ యువకుడి దారుణ హత్యను ఖండిస్తున్నామని అన్నారు. ఈ నేరానికి పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెట్టాలని ఆశిస్తున్నాం. తాత్కాలిక ప్రభుత్వ హయాంలో హత్యలు, దహనాలు, భూ కబ్జాలతో సహా మైనారిటీలపై 2,900 కంటే ఎక్కువ హింసాత్మక సంఘటనలు జరిగినట్లు స్వతంత్ర వర్గాలు నమోదు చేశాయి. ఈ సంఘటనలను కేవలం రాజకీయ హింసగా తోసిపుచ్చలేమని పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో ఇద్దరు హిందూ వ్యక్తులను కొట్టి చంపిన నేపథ్యంలో భారత్ ఈ వ్యాఖ్యలు చేసింది. అయితే ప్రపంచవ్యాప్తంగా నిరసలు వస్తున్నా బంగ్లాదేశ్‌లో ముస్లిమేతరులు సహా పలువురి మీద జరుగుతున్న దాడులపై ప్రకంపనలు ఆగడం లేదు. విప్లవవాద నాయకుడు షరీఫ్ ఒస్మాన్ హడీ హత్యను నిరసిస్తూ అతని మద్దతుదారులు శుక్రవారం ఢాకాలోని కీలక కూడలిని దిగ్బంధం చేశారు. న్యాయం చేయాలని నినదిస్తూ బైఠాయించడంతో ట్రాఫిక్ గంటలతరబడి నిలిచిపోయింది. ఢాకా విశ్వవిద్యాలయ మసీదు నుంచి షాబాగ్ వరకు ప్రదర్శన చేపట్టి ధర్నా నిర్వహించారు. న్యాయం జరిగేవరకు పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. హడీ హత్యానంతరం చెలరేగిన అల్లర్లు, విధ్వంసకాండలో హిందూ కార్మికుడు దీపూ చంద్రదాస్ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. మరోవైపు.. బ్రిటన్‌లోని ప్రవాసం వీడి 17 ఏళ్ల తర్వాత స్వదేశానికి చేరుకున్న బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ తాత్కాలిక ఛైర్మన్ తారిఖ్ రహ్మాన్ తన తండ్రి, బంగ్లా మాజీ అధ్యక్షుడు జియాఉర్ రహ్మాన్ సమాధిని సందర్శించి నివాళులర్పించారు. 19 ఏళ్ల తర్వాత ఈ సమాధి వద్దకు రాగలగడంపై ఉద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకున్నారు. బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీ లపై దాడుల్ని కేంద్ర మాజీమంత్రి మీనాక్షీ లేఖి ఖండించారు. బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లలో ఇంకా కొందరు నేతలు మొగల్ చక్రవర్తి బాబర్ మాదిరి ఆలోచనాధోరణితో ఉన్నారని విమర్శించారు. అందుకే ఆ రెండు దేశాల్లో హత్యలు జరుగుతున్నాయన్నారు. భారత్‌ను రెచ్చగొట్టాలనేదే వారి ఉద్దేశమని ఆరోపించారు. దండెత్తి వచ్చేవారిపై సహృదయత చూపాల్సిన అవసరం లేదన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడుల్ని భారత్ ఖండించింది. కిరాతకమైన దాడిలో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోవడానికి కారకులైన దోషుల్ని శిక్షించాలని డిమాండ్ చేసింది. తాత్కాలిక ప్రభుత్వం వచ్చాక దాదాపు 2,900 హింసాత్మక ఘటనలు మైనారిటీలపై జరిగాయని విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది. వీటిని రాజకీయ హింసగా కొట్టిపారేయ లేమంది. పశ్చిమబెంగాల్ శాసనసభ విపక్షనేత సువేందు అధికారి కోల్‌కతాలో బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషన్ కార్యాలయంలో సీనియర్ అధికారులను కలిశారు. హిందూ మైనారిటీలపై దాడులకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఐదులక్షల మంది సన్యాసులతో వచ్చి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. బంగ్లాదేశ్‌లోని రెండుకోట్ల మంది హిందువుల్ని పదేపదే లక్ష్యంగా చేసుకుంటుంటే భారత్‌లోని వందకోట్ల మంది హిందువులు మౌన ప్రేక్షకులుగా కూర్చొంటారా అని ప్రశ్నించారు. మొత్తంగా బంగ్లను ఇలాగే వదిలేస్తే దారుణాలు పెరుగుతాయని గుర్తించాలి.

# మళ్లీ యూరియా కష్టాలు మొదలు

వరంగల్,ఎరువుల కష్టాలు తీరడం లేదు. యాప్ వచ్చినా యూరియా కష్టాలు షరామామూలు అన్నట్లుగా సాగుతున్నయి. చల్లని చలిలో రైతులు క్యూలో చెప్పులు, కర్రలు పెట్టి పడిగాపులు పడుతున్నారు. పలు గ్రామాల్లో రైతులు ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. యూరియా ఇప్పించండని వేడుకుంటున్నారు. వానకాలంలో యూరియా కోసం గంటల తరబడి క్యూలోనే ఉన్న అన్నదాతలకు 'ఫర్టిలైజర్ బుకింగ్ యాప్'తో చిక్కుల్లోకి నెట్టింది. రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచాల్సింది పోయి, ఎరువుల కష్టాలను మరింత ఎక్కువ చేసేలా రూపొందించిన యాప్ అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్‌ను ప్రారంభించిన తొలిరోజునే పనిచేయకపోవడం గమనార్హం. దీంతో రైతులకు యాసంగిలో కష్టాలు తప్పేలా లేవనే వాదనలు వినిపిస్తున్నాయి. అసలే అంతంత మాత్రం చదువులతో సేద్యం చేసుకుంటున్న రైతన్నకు మొబైల్ యాప్ ద్వారా ఎరువులను బుక్ చేసుకోవాలంటే కత్తి మీద సాములాంటిదేనని పేర్కొంటున్నారు. గతంలో ఇచ్చినట్లే ఎరువులను పాత పద్ధతిలోనే ఇవ్వాలని రైతులు కోరుతుతన్నారు. ఫోన్ల గురించి మాకు తెలియదు. మేము ఇప్పటికీ చిన్న ఫోన్లనే వాడుతున్నం. ఎప్పుడు, ఎలా బుక్ చేసుకోవాలో మాకు తెలియదు. వానకాలంలో ఇచ్చినట్లు గోదాంలో పైసలు కట్టి తీసుకపోయినట్లు ఇస్తే బాగుంటుందని సూచిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్నప్పటికీ చాలా మంది రైతుల వద్ద ఆండ్రాయిడ్ ఫోన్లు లేవు. ఇప్పటికీ కీ ప్యాడ్ ఫోన్లనే ఉపయోగిస్తున్నారు. ఒకవేళ ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్నా యాప్‌లో ఎరువులు బుక్ చేయడం , ఓటీపీలు చెప్పడంపై ఏ మాత్రం అవగాహన లేదు. ఈసారి యాసంగికి కూడా కష్టాలు తప్పేలా లేవని రైతులు ఆందోళన చెందుతున్నారు. చాలా మంది రైతులకు ఎరువుల షాపుల పేర్లు కూడా తెలియని పరిస్థితి. యాప్‌లో ఎరువులను బుక్ చేసుకుంటే ఊరు, దుకాణం పేరు నమోదై ఉంటుంది. ఏ షాపు పేరు బుక్ చేస్తే అదే దుకాణానికి వెళ్లి ఐటీ నంబర్ చెబితేనే ఎరువులు ఇస్తారు. లేకపోతే ఎరువులు తీసుకోవడం కుదరదు. అది 15 రోజులు దాటితే ఎరువుల బుకింగ్ క్యాన్సిల్ అవుతుంది. ఇలాంటి సమస్యలను రైతులు ఎలా అధిగమిస్తారని, లేక పాత పద్ధతిని ఎంచుకుంటారా అనేది వేచిచూడాలిమరి. పంటల వివరాలు నమోదు చేసుకొని రైతులకు సాగుపై అవగాహన కల్పించాల్సిన వ్యవసాయ శాఖకు ప్రభుత్వం కొత్త టాస్క్ అప్పజెప్పింది. యాప్‌లపై అవగాహన లేని రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వ్యవసాయ విస్తీర్ణాధికారులదే. డీలర్ షాపుల వద్ద ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి యాప్‌లపై అవగాహన కల్పించాలని చెప్పడంతో అధికారులు నానా ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ఇప్పటికే ఏఈవోలకు జిల్లా అధికారులు అవగాహన కల్పించే పనిలో పడ్డారు. మారుమూల గ్రామాల్లో రైతులకు అసలు సమాచారం చేరుతుందా, ఆ గ్రామాలకు ఏఈవోలు వెళ్తారా అనేది పెద్ద ప్రశ్న. కామారెడ్డి జిల్లాలో 4 లక్షల 4 వేల 525 ఎకరాలు రైతులు సాగుచేస్తున్నట్లు వ్యవసాయ శాఖ వద్ద లెక్కలు ఉన్నాయి. దీంతోపాటు 40 వేల మంది కౌలు రైతులు కూడా సాగుచేస్తున్నట్లు అంచనా వేశారు. యాసంగి పంటలకు సకాలంలో రైతులకు ఎరువులు అందుతాయో లేదా చూడాల్సిందే మరి.

# 40 శాతం వరకు సమయం ఆదా

హైదరాబాద్,రోజువారీ ఉద్యోగ విధుల్లో భాగంగా కస్టమర్లతో మాట్లాడాల్సిన ఫ్రంట్‌లైన్ ఉద్యోగులను తీసుకునేందుకు అంకుర సంస్థలు కొత్త పంథాను ఎంచుకుంటున్నాయి. ప్రాథమికంగా దరఖాస్తులను మదింపు చేయడంలాంటి పనుల కోసం ప్రాంతీయ భాషల్లోని కృత్రిమ మేధ (ఏఐ) సాధనాలను విస్తృతంగా ఉపయోగించుకుంటున్నాయి. ఈ టూల్స్ వినియోగంతో నియామకాలకు పట్టే సమయం దాదాపు 40% వరకు ఆదా అవుతోందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. షెఫ్‌లు, స్టోర్ ఆపరేటర్లలాంటి ఉద్యోగాలకు చాలా మంది దరఖాస్తుదారులు, ఇంగ్లిష్ కన్నా, ప్రాంతీయ భాషల్లోనే మాట్లాడటమే సౌకర్యవంతంగా భావిస్తున్నారనే విషయం గ్రహించిన క్లౌడ్ కిచెన్ ఆపరేటరు క్యూర్‌ఫుడ్స్ ఈ ఏడాది నుంచి నియామకాల ప్రక్రియ కోసం నేటివ్ ల్యాంగ్వేజ్ ఏఐ సాధనాలను ఉపయోగించడం ప్రారంభించింది. ప్రస్తుతం తొలి దశ స్క్రీనింగ్‌ను ఆటోమేటెడ్ వాయిస్‌బాట్స్‌తో నిర్వహిస్తోంది. దీని వల్ల రిక్రూట్‌మెంట్ విభాగం సిబ్బందిపై ఒత్తిడి, అలాగే నియామకాలకు పట్టే సమయం తగ్గుతోందని కంపెనీ పేర్కొంది. తెలుగు, తమిళం, హిందీ తదితర ప్రాంతీయ భాషలకు ప్రాధాన్యమిచ్చే, ద్వితీయ..తృతీయ శ్రేణి పట్టణాల్లో నివసించే ప్రతిభావంతులైన దరఖాస్తుదార్లనూ పరిగణనలోకి తీసుకునేందుకు వీలవుతోందని తెలిపింది. వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు తోడ్పడుతోందని పేర్కొంది.

వాహన్ ఏఐ తదితర థర్డ్ పార్టీ ప్లాట్‌ఫాంలు

కొన్ని ఈ-కామర్స్, టెక్ స్టార్టప్‌లలో సిబ్బంది సంఖ్య 70 శాతం పైగా పెరిగే అవకాశం ఉందనే అంచనాలు ఉన్నాయి. చాలా అంకుర సంస్థలు తమ మానవ వనరుల విభాగంలో సిబ్బందిని పెంచుకోవాల్సిన అవసరం లేకుండా, ప్రాంతీయ భాషల్లో హైరింగ్ సొల్యూషన్స్ అందించే థర్డ్ పార్టీ ప్లాట్‌ఫాంల సర్వీసులను వినియోగించుకుంటున్నాయి. దీంతో వాహన్ ఏఐ, బోల్నా ఏఐ, సంవాదిని లాంటి కంపెనీల సేవలకు డిమాండ్ పెరుగుతోంది. స్టార్టప్‌లు చిన్న పట్టణాల్లోని ప్రతిభావంతులను కూడా తీసుకునేందుకు ఈ తరహా హైరింగ్ విధానం ఉపయోగపడుతోందని ఇన్‌స్టాహైర్ వర్గాలు వివరించాయి. దేశీయంగా ఏఐ ప్రొఫెషనల్స్ 23.5 లక్షల మంది పైగా ఉన్నప్పటికీ వివిధ కార్యకలాపాల నిర్వహణకు తగినంత మంది దొరకడం లేదు. డిమాండ్, సరఫరాకి మధ్య 51% పైగా వ్యత్యాసం ఉంటోంది. దీనితో ఎక్కువగా సంక్లిష్టత ఉండని, పెద్ద స్థాయిలో నిర్వహించాల్సిన ప్రాథమిక స్క్రీనింగ్, రొటీన్‌గా వచ్చే ప్రశ్నలకు సమాధానాలివ్వడం, ఇంటర్వ్యూలను ఫిక్స్ చేయడంలాంటి పనుల కోసం అంకురాలు ఏఐ టూల్స్‌ని ఎంచుకుంటున్నాయి. ప్రాంతీయ భాషల్లోని వాయిస్ బాట్స్ ఏకకాలంలో పెద్ద సంఖ్యలో కాల్స్‌ని హ్యాండిల్ చేయగలుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అప్నాలాంటి జాబ్స్ మార్కెట్‌ప్లేస్ అంకుర సంస్థ అంతర్గతంగా రూపొందించిన ఏఐ కాలింగ్ ఏజెంటును వినియోగిస్తోంది. తొలి దశ స్క్రీనింగ్‌కి దీన్ని ఉపయోగిస్తోంది. రిక్రూటర్లు నిర్దిష్టంగా ప్రశ్నలను తయారు చేసి సిస్టమ్‌లో ఫీడ్ చేస్తారు. ఆ తర్వాత సదరు సిస్టమే, దరఖాస్తుదార్లకు కాల్ చేసి, వారి సమాధానాలను విశ్లేంచుకుని, షార్ట్‌లిస్ట్ చేస్తుంది. దీని వల్ల మాన్యువల్‌గా స్క్రీనింగ్‌కి పట్టే సమయం సగానికి పైగా తగ్గింది. ఈ టూల్‌ని అప్నా తమ క్లయింట్ కంపెనీలకూ ఆఫర్ చేస్తోంది.

మెరుగ్గా అంచనా వేసేందుకు వీలు ..

అలాగే దేశవ్యాప్తంగా చిన్న, మధ్యతరహా సంస్థలకు (ఎంఎస్‌ఎంఈ) రుణ సేవలందించే ఫ్లెక్సిలోన్స్ కూడా ఇదే తరహాలో నియామకాలకు ఏఐ టూల్స్‌ని ఉపయోగిస్తోంది. దీనితో ఫ్రంట్‌లైన్ సిబ్బంది నియామకాల ప్రక్రియకు పట్టే సమయం 30%-%40 శాతం మేర తగ్గిందని కంపెనీ వివరించింది. అభ్యర్థులు తమకు సౌకర్యవంతంగా ఉండే భాషలో మాట్లాడటం వల్ల వారి సామర్థ్యాలను మరింత మెరుగ్గా అంచనా వేసేందుకు వీలవుతోందని తెలిపింది. ఇలాంటి సిస్టమ్స్ ఇచ్చే విశ్లేషణల వల్ల పక్షపాత ధోరణి తగ్గి, అభ్యర్థుల షార్ట్‌లిస్టింగ్ ప్రక్రియ వేగవంతమవుతుందని ఫ్లెక్సిలోన్స్ వివరించింది. ముఖ్యంగా రాతపరమైన ఇంగ్లిష్ నైపుణ్యాల కన్నా స్థానిక భాషల్లో మాట్లాడే నైపుణ్యాలు ఎక్కువగా అవసరమయ్యే సేల్స్, కలెక్షన్ మొదలైన ఉద్యోగాలకు ఇది ఎంతో ఉపయోగకరమని పేర్కొంది.

# భ్రమలు నడిపే జీవితాలు...



న్యూఢిల్లీ,వాస్తవాలతో నిమిత్తం లేని భ్రమలు మనిషి జీవితంలో ఎటువంటి పాత్ర వహిస్తాయో మానసిక శాస్త్రవేత్తలు అధ్యయనం చేసి రాసే ఉంటారు. వాటిని చదవగలిగితే మనకు చాలా అర్థమవుతాయి. అటువంటి అధ్యయన సూత్రాలను ప్రస్తుతం నెహ్రూ గాంధీ కుటుంబానికి అన్వయింపజేసి చూడటం అవసరమనిపిస్తున్నది. సోనియా గాంధీకి కాకున్నా, ఆ వంశ వారసులైన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు. ఇటీవల కొన్ని వారాలుగా ప్రియాంక గురించిన చర్చలు జరుగుతున్నాయి. లేదా మరొకసారి జరుగుతున్నాయనాలి. లోగడ సుమారు పదేళ్ల క్రితం కూడా మాటలు వినిపించాయి. రాహుల్ గాంధీ 2004లో ప్రత్యక్ష రాజకీయాలలో ప్రవేశించిన తర్వాత అప్పటికి పదేళ్లు దాటిపోయాయి. 2004 నుంచి 2014 వరకు అధికారంలో ఉండిన కాంగ్రెస్ పార్టీ ఓడిపోగా, బిజెపి అధికారానికి వచ్చింది. కాంగ్రెస్ క్రమంగా ఒక్కొక్క రాష్ట్రాన్ని కోల్పోవటం మొదలైంది. సోనియా గాంధీ వయసు రీత్యా, ఆరోగ్య సమస్యల కారణంగా క్రియాశీలంగా ఉండటం తగ్గింది. అటువంటి స్థితిలో పార్టీ వాదులంతా ఇక రాహుల్ గాంధీయే తమకు పెద్ద దిక్కు అని భావించి ఆయన వైపు చూడసాగారు. కాని ఆయన వారిని నిరాశపరిచేందుకు ఎక్కువ సమయం తీసుకోలేదు. అంతలోనే 2019 ఎన్నికలు రాగా కాంగ్రెస్ రెండవసారి పరాజయం పాలైంది. నిజానికి ఈ రెండు ఎన్నికలను మధ్యనే రాహుల్ కన్న ప్రియాంక మెరుగు అనే మాటలు వినిపించసాగాయి. ఏ విధంగా మెరుగో ఎవరూ థియరైజ్ చేసినట్లు అయితే ఏమీ చెప్పలేదు. పైకి వినిపించింది మాత్రం ఆమెలో తన నానమ్మ ఇందిరా గాంధీ పోలికలున్నాయని. వారు మాట్లాడిందంతా ముఖకవళికల పోలికల గురించి. అంతేతప్ప, ఇందిర వంటి విధానాలు, సమర్థతలు, వ్యక్తిత్వం గురించి కాదు. ఈ గతాన్ని ఇట్లాగే తవ్వుతూ పోవాలంటే, ఒక ప్రముఖ ఇంగ్లీషు మేగజైన్ కథనమే నిజమనుకుంటే, సోనియా నుంచి అధికారం రాహుల్‌కు బదిలీ కావాలా లేక ప్రియాంకకా అనే చర్చ వారి కుటుంబంలో ఆంతరంగికంగా 2014 ఎన్నికలకు ముందే జరిగిందట. కొందరు అటు, కొందరు ఇటు మొగ్గు చూపగా చివరకు రాహులే సరైన వారసుడనే నిర్ణయానికి వచ్చారట. కారణం? రాహుల్ మగబిడ్డ కావటం. వంశవారసత్వం మగ సంతానం మీదుగా జరగటం భారతీయ సంప్రదాయం. పైగా ప్రియాంక ఒక 'బయటి మనిషి' ని వివాహం చేసుకుంది. వారి సంతానానికి ఆ తర్వాతి వారసత్వం సంక్రమిస్తే ఒక నాయకత్వం తమ వంశాన్నే వీడిపోతుంది. అది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఈ విధంగా బలమైన వాదనలు ముందుకు రావటంతో, ప్రియాంక తన నానమ్మను పోలి ఉన్నందున దేశ ప్రజలు ఆదరించగలరనే వాదనలు వీగిపోయాయన్నది ఆ కథనపు సారాంశం. ఆ తర్వాత ఇన్నేళ్లకు, ప్రియాంకలో ఇందిరా గాంధీ పోలికలు, ఆ కారణంగా ఆమె పార్టీ నాయకత్వానికి అర్హురాలు కావటం అనే మాటలు తిరిగి వినిపిస్తున్నాయి. మొదటి విడత మాటలు వీగిపోయిన తర్వాత కొన్ని గమనించదగ్గవి జరిగాయి. కాంగ్రెస్ అధికారానికి గాని, పార్టీ యథాతథంగా బలపడటానికి గాని రహదారి తమ సంప్రదాయిక క్షేత్రమైన ఉత్తరప్రదేశ్ మీదుగానే అని అర్థమైన రాహుల్ గాంధీ, ఆయన సలహాదారులు, సహాయకులూ ఆయనను ఆ రాష్ట్రంలో పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టవలసిందిగా చెప్పారు. అప్పటికి అక్కడ సమాజ్‌వాదీ పార్టీ, బిఎస్‌పి, బిజెపి బలపడటంతో కాంగ్రెస్ బాగా బలహీనపడింది. అందువల్ల రాహుల్‌కు ఆ అజెండా సరైనది అయింది. అయితే, అంతటి బృహత్కార్య భారాన్ని సోదరుడు ఒక్కనిపై వేయటం సరికాదని భావించిన ప్రియాంక కూడా తనతో పాటు రంగంలోకి వెళ్లారు. ఇద్దరు కలిసి కూడా పార్టీని బాగు పరచలేకపోయారన్నది అట్లుంచితే, అక్కడ పని చేసిన కాలంలో అన్నాచెల్లెళ్లు ఇద్దరినీ గమనించిన అక్కడి ప్రజలు, కాంగ్రెస్ వాదులు కూడా అన్న కంటే చెల్లెలికే ఎక్కువ మార్కులు వేసినట్లు అప్పుడు పత్రికలు రాశాయి. అందుకు ఎవరి పని తీరు ఎంత కారణమో, నాయనమ్మతో మనవరాలి పోలికలు ఎంత కారణమో తెలియదు. అయితే ఇప్పుడు పత్రికలు, మేగజైన్లలో ఫోటోలు గమనించిన వారికి, వీరిద్దరూ కలిసి గ్రామాలకు వెళ్లినప్పుడు, ముఖ్యంగా మహిళలు, యువకులు, వృద్ధులు రాహుల్ కన్న ప్రియాంక పట్ల ఎక్కువ ఆసక్తి చూపటం కనిపించేంది. వారు ప్రియాంకను 'ఇందిరాకీ పోతీహై'(ఇందిర మనవరాలు) అంటూ అదే పనిగా చెప్పుకుని తనతో మాట్లాడేందుకు ఉబలాటపడేవారట. అవే ఫోటోలలో రాహుల్ ఒక పక్కకు వెలవెలబోతూ కన్పించేవారు. ఇప్పుడు పరిస్థితి అక్కడేమిటో తెలియదుగాని, ప్రియాంక ఇందిర పోలికలు నాయకత్వానికి అర్హత అనే మాటలు తిరిగి ఢిల్లీలో వింటున్నాము. ఇట్లా మధ్య మధ్య ఎందుకు జరుగుతున్నట్లు? మామూలుగా కలిగే ఆలోచనలను బట్టి ఒక్క మాటలో చెప్పాలంటే, రాహుల్ గాంధీ సమర్థుడు అయి ఉంటే ఈ విధంగా భిన్నమైన ఆలోచనలకు ఎంతమాత్రం అవకాశం ఉండదు. 2004లో రాజకీయాలలోకి వచ్చిన ఆయన గత 20 సంవత్సరాల కాలంలో ఎంతో అనుభవం గడించి, పరిణితిని, సమర్థతను సాధించి, తన మాటకు ఎటువంటి ఎదురు లేదు గనుక పార్టీని బలంగా నిర్మించవలసింది. 2014 ఎన్నికలలో ఓడినా, 2019 నాటికి బిజెపిని సవాలు చేసి నిలబడవలసింది. దీనంతటిలో తగినన్ని ఇతర పార్టీలు కూడా వెంట నిలిచినందున ఆ పని కష్టం కాకూడదు. కాని అంతా అందుకు విరుద్ధంగా జరుగుతున్నది. కాంగ్రెస్ బలహీనపడటం ఆగలేదు సరికదా, ఇటీవలి ఎన్నికల ఓటమి తర్వాత యుపిఎ కూటమి కకావికల వుతున్నది. కారణాలు అనేకం. అన్నింటిలో కనిపిస్తున్నది రాహుల్ అవగాహన రాహిత్యాలు, అసమర్థత, ఇన్నేళ్లయినా రాని పరిణతి. ఇందుకు ఉదాహరణలు ఎన్నయినా చెప్పవచ్చు. రాహుల్ కన్న ప్రియాంక మెరుగని లోగడ వచ్చిన మాటలను ప్రతిసారీ ఆ కుటుంబమే ఆగిపోయేట్లు చేసింది. ఇపుడు తాజాగా ఇమ్రాన్ మసూద్ అనే కాంగ్రెస్ ఎంపి అవే మాట అనటానికి మించి, సాక్షాత్తూ ప్రియాంక భర్త రాబర్ట్ వాద్రా అనటం సహజంగానే సంచలనంగా మారింది. అందుకు వారి కుటుంబంలోని స్పందనలు ఏమిటో మనకు వెంటనే తెలిసే అవకాశం లేదు. వీరిద్దరు ఇట్లా వ్యాఖ్యానించటమే కాదు లోక్‌సభలో అన్నాచెల్లెళ్ల వ్యవహార శైలిలో తేడాలను చూపుతూ, ఇటువంటి అభిప్రాయమే బయట కూడా కొందరికి ఏర్పడుతున్నట్లు తోస్తున్నది. ఇదంతా నేపథ్యం కాగా ఇప్పుడు అసలు విషయానికి వద్దాము. మొదట 'భ్రమలు' అనే మాటలను పేర్కొనటానికి కారణం ఏమిటి?

## మహారాష్ట్ర నాందేడ్‌లో విషాద ఘటన

ముంబై, ఇద్దరు కొడుకులు కలిసి నిద్రిస్తున్న తల్లిదండ్రులను హత్య చేశారు. ఆ తర్వాత రైలు ముందు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. తండ్రి అనారోగ్యం వల్ల అప్పులపాలు కావడంతో వారిద్దరూ ఇలా చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. డిసెంబర్ 25న జవాలా మురార్ గ్రామానికి చెందిన 51 ఏళ్ల రమేష్ సోనాజీ లాఖే, 45 ఏళ్ల భార్య రాధాబాయి వారి ఇంట్లో మంచంపై మరణించడాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు ఆ ఇంటికి చేరుకున్నారు. దంపతుల మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిద్రిస్తున్న ఆ భార్యాభర్తలను గొంతునొక్కి చంపినట్లు పోస్ట్‌మార్టం రిపోర్ట్‌లో తేలింది. కాగా, అదే రోజున ఆ గ్రామానికి కొంత దూరంలోని రైలు పట్టాలపై ఆ దంపతుల కుమారులైన 25 ఏళ్ల ఉమేష్, 23 ఏళ్ల బజరంగ్ మృతదేహాలు కనిపించాయి. దీంతో వారిద్దరి మృతదేహాలను కూడా పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అన్నదమ్ములు రైలు ముందు దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. మరోవైపు ఒకే రోజు ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వేర్వేరుగా మరణించిన ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేశారు. స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. పక్షవాతంతో మంచానికి పరిమితమైన రమేష్ చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. ఆయనకు చికిత్స కోసం ఆ కుటుంబం అప్పులపాలైనట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆర్థిక బాధలు తట్టుకోలేక ఇద్దరు కుమారులు తమ తల్లిదండ్రులను చంపి ఆ తర్వాత రైలు ముందు దూకి ఆత్మహత్య చేసుకున్నారని పోలీసులు గ్రహించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. ఈ సంఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

## అర్ధరాత్రి వేళ విషవాయువులకు ముగ్గురు మృతి

పాట్నా, చలికాలం నేపథ్యంలో గదిలో వెచ్చదనం కోసం మంట రాజేసి ఒక కుటుంబం నిద్రించింది. విష వాయువులు వెలువడటంతో ఒక వృద్ధురాలు, ముగ్గురు పిల్లలు మరణించారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నది. బీహార్‌లోని ఛాప్రా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఛాప్రాకు చెందిన ఒక కుటుంబం గురువారం రాత్రి వేళ గదిలో వెచ్చదనం కోసం బొగ్గుల కుంపటి వెలిగించారు. తలుపులు, కిటికీలు మూసేశారు. ఎనిమిది మంది కుటుంబ సభ్యులు ఆ గదిలో నిద్రించారు. కాగా, బొగ్గుల కుంపటి మండటంతో ఆ గదిలో ఆక్సిజన్ స్థాయిలు పడిపోయాయి. విషపూరిత కార్బన్ మోనాక్సైడ్ పేరుకుపోయింది. దీంతో ఆ గదిలో నిద్రించిన ఎనిమిది మంది స్పృహ కోల్పోయారు. శుక్రవారం తెల్లవారుజామున కింది అంతస్తులో నివసించే బంధువులు పైకి వెళ్లి చూశారు. ఆ గదిలో ఉన్న వారి పరిస్థితి చూసి ఆందోళన చెందారు. మరోవైపు వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. మూడేళ్ల తేజాంష్ కుమార్, ఏడు నెలల గుడియా కుమారి, ఆదియా కుమారి, 70 ఏళ్ల కమలావతి దేవి అప్పటికే మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. 25 ఏళ్ల ఆర్య కుమారి, 24 ఏళ్ల ఆర్య సింగ్, 25 ఏళ్ల అనిషా, 35 ఏళ్ల అమిత్ అలియాస్ సోనుకు ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు.కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకున్నారు. ఆ తర్వాత బొగ్గుల కుంపటి ఉంచిన గదిని పరిశీలించారు. ఫోరెన్సిక్ బృందాన్ని పంపి ఆధారాలను సేకరించారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. మరోవైపు శీతాకాలంలో మూసి ఉన్న బెడ్ రూముల్లో బ్రజియర్లు, హీటర్లు, బ్లోయర్‌లను ఉపయోగించవద్దని ఆ జిల్లా అధికారులు సూచించారు. నిద్రించే గదిలో సరైన వెంటిలేషన్ ఉండేలా చూసుకోవాలని కోరారు. తద్వారా ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు.

## మండిపడుతున్న జనసైనికులు

గుంటూరు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై తరచుగా అనుచిత పోస్టులు పెట్టడం సంచలనం రేపుతోంది. రాజకీయ, వ్యక్తిగత కక్ష సాధింపు చర్యల్లో భాగంగా అసభ్యకరమైన వ్యాఖ్యలతో పవన్‌ను ఉద్దేశించి పలువురు అనుచిత పోస్టులు పెట్టడం పరిపాటిగా మారింది. ఇలాంటి కేసుల్లో నిందితులను పోలీసులు అరెస్ట్ చేసిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పుడు తాజాగా మరోసారి పవన్‌పై అసభ్యకరమైన పోస్టు పెట్టడం తీవ్ర కలకలం రేపుతోంది. అది కూడా ఇటీవల ఇప్పటంలో ఓ వృద్ధురాలిని పవన్ కలిసిన ఫొటోలను అసభ్యకర రీతిలో పోస్టు చేశాడో వ్యక్తి. దీనిపై జనసేన నేతలు, కార్యకర్తలు, పవన్ అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. ఇచ్చిన మాట కోసం ఇటీవల గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఇప్పటంలో వృద్ధురాలు ఇండ్ల నాగేశ్వరమ్మ ఇంటికి పవన్ వెళ్లిన విషయం తెలిసిందే. ఆమె కాళ్లను నమస్కరించడంతో పాటు.. వృద్ధురాలిని మాతృభావంతో ఆప్యాయంగా ఆలింగం చేసుకున్నారు డిప్యూటీ సీఎం. అంతేకాకుండా వృద్ధురాలికి రూ.50వేలు, మనవడి చదువుకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. ఎప్పుడూ అండగా ఉంటానని పవన్ భరోసా ఇచ్చారు. పవన్ రాకతో వృద్ధురాలు కూడా ఎంతో ఆనందం వ్యక్తం చేసింది. అయితే, సదరు వృద్ధురాలిని పవన్ ఆలింగనం చేసుకున్న ఫొటోను తప్పుడు దృష్టితో చూసిన ఓ వ్యక్తి.. అనుచిత వ్యాఖ్యలతో దాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. నిందితుడు గుంటూరు జిల్లాకు చెందిన వ్యక్తిగా తెలుస్తోంది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన జనసైనికులు వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనుచితంగా పోస్ట్ చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన నేతలు డిమాండ్ చేశారు.

## బంగ్లాదేశ హిందువులను రక్షించాలి

అమరావతి, బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలని బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కోరారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దారుణాలపై ప్రతి ఒక్కరూ స్పందించాలన్నారు. శనివారం నాడు మీడియాతో మాట్లాడిన మాధవ్.. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దురాగతాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి రాజకీయ పార్టీ బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలను నిశితంగా గమనించి.. పొరుగు దేశంలో హిందువుల రక్షణ కోసం గళం విప్పాలని కోరారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మూక దాడులను, హత్యలను సినీ ప్రముఖులు ఖండిస్తున్నారని మాధవ్ పేర్కొన్నారు. హీరోయిన్లు జాన్వీపూర్, కాజల్ అగర్వాల్, సీనియర్ నటి, మాజీ ఎంపీ జయప్రద చేసిన పోస్టులు కొంత ఊరట నిస్తున్నాయన్నారు. భారత విదేశాంగశాఖ బంగ్లాదేశ్‌పై ఘాటు గానే స్పందించిందన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు మాధవ్.

# ఆగని వరకట్న పైశాచికం...

హైదరాబాద్,దేశంలో అత్యాచారాల కంటే వరకట్న మరణాలే అత్యధికంగా ఉన్నాయని నివేదికలు చెబుతున్నాయి. తల్లిదండ్రులు ఆడపిల్లలను అల్లారుముద్దుగా పెంచి పెద్దచేసి చదువులు చెప్పిస్తారు. తమ కుటుంబ మర్యాద, హోదాకు తగిన సంబంధం చూసి పెళ్లి చేస్తారు. అత్తింటి వారు అడిగిన చీరెసారెలతోపాటు వరకట్నం చెల్లిస్తారు. మెట్టినింట తమ బిడ్డ సుఖపడుతుందని ఎన్నో కలలు కంటుంటారు. తీరా పెళ్లి జరిపించిన తరువాత మితిమీరిన ధనదాహంతో వరకట్నం చాలలేదని లేదా ఇంకా మరికొన్ని గొంతెమ్మ కోరికలు తీర్చలేదని ఏవో సాకులతో మగడే కాలయముడై పేట్రేగిపోవడం, అత్తమామలు కిరాతకులై హింసించడం చేస్తే ఆ ఇంటి దీపానికి ఎవరు దిక్కు. తల్లిదండ్రులకు లేదా బంధువులకు చెప్పుకోలేక కుమిలికుమిలి ఆత్మహత్యకు పాల్పడడమే శరణ్యమవుతోంది. ఈ విషాదాంత గాథలకు వరకట్న పిశాచమే కారణం. కేరళలో 2021లో వివాహిత అయిన వైద్య విద్యార్థిని విస్మయ (22) ఆత్మహత్య కేసు దేశంలో సంచలనం కలిగించింది. రెండు లక్షలు కట్నం ఇవ్వడంతోపాటు 100 సవర్ల బంగారం, ఎకరం భూమి, రూ. 10 లక్షల విలువైన కారు, ఇచ్చినా వరుని వరకట్న దాహం ఆరలేదు. ఇంకా కావాలని విస్మయను చిత్రహింసలకు గురిచేయడంతో ఆత్మహత్యకు పాల్పడింది. ఈ కేసులో నిందితుడు భర్త కిరణ్ కుమార్‌కు కోర్టు పదేళ్లు జైలు శిక్షతోపాటు రూ. 12.55 లక్షల జరిమానా విధించింది. తాజాగా ఉత్తరప్రదేశ్ లోని గ్రేటర్ నొయిడాలో ఇచ్చిన కట్నం చాల్లేదని భర్త, అత్తింటివారు కలిసి ఆ ఇల్లాలి ప్రాణాలు తీసేశారు. రాజస్థాన్ లోని జోధ్‌పూర్‌కు చెందిన ప్రభుత్వ టీచర్ వరకట్న వేధింపులకు భరించలేక తన కూతురితోసహా ఆత్మహత్య చేసుకుంది. ఈ విధంగా ప్రతిరోజూ సగటున 19మంది మహిళలు వరకట్న జ్వాలలకు బలైపోతున్నారని నేషనల్ క్రైమ్ బ్యూరో నివేదిక వెల్లడించింది. వరకట్న నిషేధ చట్టం 1961 నుంచి అమలులో ఉన్నా వరకట్నం మరణాలు ఆగడం లేదు. ఇరవై ఏళ్ల వధువు కాళ్లపారాణి ఆరకముందే వరకట్న పిశాచానికి బలైన దుర్ఘటన సుప్రీం కోర్టు ధర్మాసనం ముందుకు ఇటీవల విచారణకు రాగా, సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సమాజంలో సాగుతున్న వికృత ఆచారానికి ఇది ప్రతీక అని వ్యాఖ్యానించింది. అర్బన్ సెంటర్లలో ముస్లిం కుటుంబాలు కూడా తమ హోదాగా భావించి వరకట్నం తీసుకునే పద్ధతి మెహెర్‌గా ప్రారంభించారని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. ఆస్తికి యాజమాన్య హక్కు ద్వారా మహిళలకు సాధికారత కల్పించాలనే ఇస్లామిక్ వాస్తవ లక్షానికి ఇది విరుద్ధమని, దీనికి భిన్నంగా వరకట్నం చెల్లిస్తే భర్త లేదా అతని కుటుంబం నియంత్రణలోనే మహిళకు సాధికారత కోల్పోవలసి వస్తుందని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించడం గమనార్హం. దీనిపై విద్యార్థి దశ నుంచే చైతన్యం కలిగేలా పాఠ్యాంశాల్లో మార్పు తీసుకురావాలని సూచించింది. వివాహాల్లో వధువు లేదా వరుని తరపు వారు ధనం లేదా కానుకల రూపంలో ఇచ్చిపుచ్చుకోవడంలో ఒకరికింద మరొకరు అణిగిమణిగి ఉండవలసిన అవసరం లేదని, అసలు ఈ వరకట్న ఆచారం సాగనివ్వని విధంగా రాజ్యాంగంలో మార్పులు తీసుకురావాలని సూచించింది. ఈ విషయంలో కఠినంగా వ్యవహరించేలా వరకట్న నిషేధ అధికారులను (డౌరీ ప్రొబేషన్ ఆఫీసర్లు) రాష్ట్రాల్లో నియమించాలని ఆదేశించింది.



ఆ అధికారులకు బాధ్యతలపై అవగాహన కల్పించడంతోపాటు తగిన వనరులు అందించాలని సుప్రీం కోర్టు సూచించింది.వరకట్నం కేసులను విచారించే పోలీస్ అధికారులకు, జ్యుడీషియల్ అధికారులకు దీనిపై తగిన శిక్షణ, స్పృహ కల్పించాలని కూడా సుప్రీం కోర్టు సూచించింది. పెండింగ్‌లో ఉన్న వరకట్నం కేసులను ఎప్పటికప్పుడు త్వరితగతిన పరిష్కరించాలని హైకోర్టులను సుప్రీం అభ్యర్థించింది. హ్యూమన్ డెవలప్‌మెంట్ సర్వే (200405) లో వెల్లడైన వివరాల ప్రకారం పెళ్లిళ్లలో వరుడి కుటుంబంతో పోలిస్తే వధువు కుటుంబం 1.5 రెట్లు ఎక్కువ ఖర్చు చేస్తున్నట్టు వెల్లడైంది. 24శాతం కుటుంబాలు నగదు రూపంలో వరకట్నం చెల్లించడంతోపాటు టివిలు, ఫ్రిజ్‌లు, కార్లు, బైక్‌లు, తదితర ఖరీదైన బహుమానాలను కూడా వరునికి సమర్పించినట్టు తెలిసింది. 201921 జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం 18 49 ఏళ్ల మధ్య వయసు గల మహిళల్లో 29 శాతం మంది భర్తలు లేదా అత్తింటివారి నుంచి శారీరక లేదా లైంగిక హింస అనుభవిస్తున్నారని బయటపడింది. ఎన్‌సిఆర్‌బి డేటా ప్రకారం ఏటా 6516 వరకట్నం మరణాలు సంభవిస్తున్నాయి. 20172022 మధ్య ఏటా 6516 వరకట్న మరణాలు సంభవించాయి.2022 చివరినాటికి 60,577 వరకట్నం కేసులు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. అందులో 54,416 కేసులు ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్నాయి. ఆ ఏడాది 3689 కేసులు విచారణ పూర్తయినా, కేవలం 33% తీర్పుల్లో నిందితులకు శిక్షపడింది. కోర్టులకు పంపిన 6161 కొత్త కేసుల్లో కేవలం 99 కేసుల్లో మాత్రమే శిక్షలు అమలయ్యాయి. దీన్ని బట్టి చూస్తే బాధిత కుటుంబాలకు ఏడాది లోపు న్యాయం దొరికే అవకాశాలు రెండు శాతం కంటే చాలా తక్కువేనని తేలింది. 2024లో నమోదైన కేసుల్లో 17% వరకట్న వేధింపుల కేసులే ఉన్నాయి. నమోదైన 25743 కేసుల్లో 4383 కేసులు వరకట్న వేధింపులవే. దక్షిణాది కన్నా ఉత్తరభారతంలోనే ఈ కేసులు ఎక్కువగా ఉంటున్నాయి. దేశంలోని మొత్తం 19 నగరాల్లో ఢిల్లీలో అత్యధికంగా 30% వరకట్న వేధింపుల కేసులు నమోదవుతున్నాయి. ఆ తర్వాత స్థానాల్లో కాన్పూర్, బెంగళూరు, లక్నో, పాట్నా వంటి నగరాలు ఉన్నాయి. బాధితులు చివరివరకూ న్యాయపరమైన సహాయాన్ని కోరడంలో వెనకడుగు వేస్తుండటంతో చాలా కేసులు బయటపడడం లేదు.

# ఉన్నత విద్యలో కొత్త అధ్యాయం



న్యూఢిల్లీ,భారతదేశ ఉన్నత విద్యా వ్యవస్థ దశాబ్దాల తర్వాత అతిపెద్ద, సమగ్రమైన నిర్మాణాత్మక మార్పుకు నాంది పలకబోతోంది. కేంద్ర మంత్రివర్గం ఇటీవల ఆమోదించిన 'వికసిత్ భారత్ శిక్షా అధిక్షణ్ బిల్లు' ఈ మార్పుకు కేంద్ర బిందువుగా నిలుస్తోంది. మునుపు దీనిని హైయర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (హెచ్‌ఇసిఐ) బిల్లు అని పిలిచేవారు. జాతీయ విద్యా విధానం (ఎన్‌ఇపి2020) ప్రధాన లక్ష్యాలలో ఒకటైన బహుళ నియంత్రణ సంస్థల వ్యవస్థను సరళీకృతం చేసి, ఒకే శక్తిమంతమైన నియంత్రణ సంస్థను స్థాపించడం ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం. ఈ చారిత్రక బిల్లు ఆమోదం, అమలులోకి రావడం అనేది భారతదేశాన్ని 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారతదేశం)గా రూపొందించడంలో విద్యా వ్యవస్థ కీలక పాత్ర పోషించాలనే ప్రభుత్వ దృష్టిని స్పష్టంగా ప్రతిబింబిస్తుంది. భారతదేశం విద్యావిధానం అంతర్జాతీయంగా పోటీ పడగలిగేలా, నాణ్యమైన విద్యను అందించేలా తీర్చిదిద్దడానికి ఈ సంస్కరణ ఒక పెద్ద ముందడుగుగా పరిగణించబడుతుంది.పాత సంస్థల స్థానంలో కొత్త వ్యవస్థ: దేశంలోని ఉన్నత విద్యా రంగం మూడు ప్రధాన, స్వతంత్ర సంస్థలచే నియంత్రించబడుతూ, వాటి మధ్య విధులలో అతి వ్యాప్తికి నియమాలలో గందరగోళానికి దారితీసింది. యుజిసి, ఎఐసిటిఇ, ఎన్‌సిటిఇ ఇప్పటివరకు ఉన్నతవిద్యా వ్యవస్థను నియంత్రిస్తున్నాయి. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి): కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు నిధులు అందించడం, సాంకేతికేతర ఉన్నత విద్యను నియంత్రించడం వంటి విధులు నిర్వహిస్తున్నది. ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఎఐసిటిఇ): ఇంజనీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ వంటి సాంకేతిక విద్యను నియంత్రిస్తుంది. నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సిటిఇ) దేశంలో ఉపాధ్యాయ శిక్షణా కోర్సులను, సంస్థలను నిర్వహిస్తుంది. ఈ బహుళ నియంత్రణ సంస్థల వ్యవస్థ విద్యా సంస్థలకు పాలనాపరమైన సంక్లిష్టతలను పెంచింది. ఈ సమస్యను పరిష్కరిస్తూ 'వికసిత్ భారత్ శిక్షాఅధిక్షణ్ కమిషన్' అనేది ఈ మూడు సంస్థల స్థానంలో ఒకే శక్తిమంతమైన, ఏకీకృత సంస్థగా రానుంది. ఇది వైద్య, న్యాయ విద్య మినహా మిగిలిన అన్ని ఉన్నత విద్యా సంస్థలను తన పరిధిలోకి తీసుకువస్తుంది.కొత్త కమిషన్ ముఖ్య లక్షణం ఏమిటంటే, నియంత్రణ, గుర్తింపు, ప్రమాణాల నిర్ధారణ వంటి విభిన్న పాత్రలను ఒకే ఛత్రం కిందకు తీసుకురావడం. ఎన్‌ఇపి 2020 ప్రతిపాదించిన విధంగా, ఈ కమిషన్ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడానికి వివిధ విభాగాలను ఏర్పాటు చేయనుంది.నియంత్రణ: ఈ విభాగం ఉన్నత విద్యా సంస్థల ఏర్పాటు, అనుమతులు, విస్తరణ, కొత్త కోర్సుల ప్రారంభం, మూసివేతలు వంటి పాలనాపరమైన, నియంత్రణాత్మక అంశాలను చూస్తుంది. విద్యా నాణ్యతకు రాజీపడకుండా సంస్థలు పనిచేస్తున్నాయో లేదో నిర్ధారించడానికి కఠినమైన నిబంధనలను రూపొందిస్తుంది. ఒకే సంస్థ నుండి నియంత్రణ లభించడం వలన, కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు బహుళ సంస్థల నుండి అనుమతి పొందే, నివేదికలు సమర్పించే అవసరం తగ్గి, పాలనా భారం తగ్గుతుంది. గుర్తింపు: విద్యా సంస్థల నాణ్యత, మౌలిక సదుపాయాలు, బోధనా ప్రమాణాలను నిష్పాక్షికంగా అంచనా వేసి, వాటికి గుర్తింపు ఇచ్చే బాధ్యత ఈ స్తంభానిది. ప్రస్తుతం, ఇది నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (ఎన్‌ఎఎసి) వంటి సంస్థల ద్వారా జరుగుతోంది. కొత్త కమిషన్ కింద, గుర్తింపు ప్రక్రియ మరింత పారదర్శకంగా, లక్ష్యం ఆధారితంగా, గ్లోబల్ ప్రమాణాలకు అనుగుణంగా బలోపేతం అయ్యే అవకాశం ఉంది.ప్రమాణాల నిర్ధారణ: సాంకేతిక, సాధారణ, ఉపాధ్యాయ విద్యతో సహా వివిధ రంగాలలో పాఠ్యాంశాల నాణ్యత, అధ్యాపకుల అర్హతలు, బోధనా పద్ధతులు, మౌలిక వసతుల కోసం వృత్తిపరమైన ప్రమాణాలను ఈ విభాగం నిర్దేశిస్తుంది.దీని ప్రధాన లక్ష్యం దేశంలో అందించబడుతున్న ఉన్నత విద్య నాణ్యత అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడటం, యువతను ప్రపంచ స్థాయి ఉద్యోగాలకు సిద్ధం చేయడం.నిధుల కేటాయింపు, పర్యవేక్షణ: ఈ బిల్లులో అత్యంత ఆసక్తికరమైన అంశం నిధుల కేటాయింపు ప్రక్రియ. ఇది మునుపటి యుజిసి విధానం నుండి స్పష్టంగా విభేదిస్తుంది యుజిసి గతంలో నియంత్రణాత్మక, నిధుల (ఫండింగ్) విధులను నిర్వహించేది. కానీ 'వికసిత్ భారత్ శిక్షా అధిక్షణ్ కమిషన్' కేవలం నియంత్రణ, గుర్తింపు, ప్రమాణాల నిర్ధారణకు మాత్రమే పరిమితం చేయబడింది. నియంత్రణాత్మక నిర్ణయాలు ఆర్థిక ప్రయోజనాలు లేదా నిధుల కేటాయింపు ద్వారా ప్రభావితం కాకుండా ఉండేలా చూడటమే ఈ విభజన ప్రధాన ఉద్దేశం. నిధులు, ఆర్థిక గ్రాంట్లను కేటాయించే బాధ్యత ప్రస్తుతానికి కేంద్ర విద్యామంత్రిత్వ శాఖలోని ఉన్నత విద్యావిభాగం వద్దే కొనసాగవచ్చు. భవిష్యత్తులో ఎన్‌ఇపి 2020 ముసాయిదాలలో ప్రతిపాదించినటుగా, ప్రభుత్వం ఉన్నత విద్యా సంస్థలకు నిధులు కేటాయించడానికి ఒక ప్రత్యేక హైయర్ ఎడ్యుకేషన్ ఫండింగ్ అథారిటీని సృష్టించే అవకాశం ఉంది.

### సానుకూల ప్రభావాలు

నియంత్రణ సరళీకృతం: బహుళ నియంత్రణ సంస్థల ద్వారా ఏర్పడే ఓవర్ ల్యాపింగ్, సంక్లిష్టత, గందరగోళం తొలగిపోయి, సంస్థల నిర్వహణ, అనుమతి ప్రక్రియలు వేగవంతం అవుతాయి. పారదర్శకత, జవాబుదారీతనం: ఒకే సంస్థ ఉండటం వలన జవాబుదారీతనం పెరుగుతుంది, నియమాలు, ప్రక్రియలలో పారదర్శకత మెరుగుపడుతుంది.

ప్రమాణాలలో ఏకీకరణ: సాంకేతిక, సాధారణ, ఉపాధ్యాయ విద్యతో సహా అన్ని విభాగాలలో నాణ్యతా ప్రమాణాలు ఏకీకృతం అవుతాయి. ఇది విద్యార్థులకు, నియామకదారులకు కోర్సు నాణ్యతపై స్పష్టతను ఇస్తుంది.

అంతర్జాతీయ గుర్తింపు: ఏకీకృత, కఠినమైన ప్రమాణాల ద్వారా భారతీయ ఉన్నత విద్య నాణ్యత పెరిగి, అంతర్జాతీయంగా గుర్తింపు పొందే అవకాశం ఉంది.

### సవాళ్లు, ఆందోళనలు

కేంద్రీకరణ ప్రమాదం: అన్ని నియంత్రణ శక్తులు ఒకే సంస్థ చేతిలో కేంద్రీకృతం కావడం వల్ల సంస్థల విద్యా స్వయంప్రతిపత్తి, విభిన్నత తగ్గే ప్రమాదం ఉంది. కొన్ని విద్యావేత్తలు ఇది కేంద్ర ప్రభుత్వం అధిక ప్రభావానికి దారితీయవచ్చు అని ఆందోళన చెందుతున్నారు. సాంకేతిక విద్య (ఎఐసిటిఇ పరిధిలో ఉండేది), ఉపాధ్యాయ విద్య(ఎన్‌సిటిఇ పరిధిలో ఉండేది) వంటి విభిన్న, ప్రత్యేకమైన అవసరాలున్న రంగాలను ఒకే కమిషన్ సమర్థవంతంగా, లోతైన దృష్టితో నిర్వహించగలదా అనేది పెద్ద ప్రశ్న. నియంత్రణాత్మక కమిషన్, నిధులు కేటాయించే మంత్రిత్వ శాఖ లేదా ఫండింగ్ అథారిటీ మధ్య సమన్వయం లోపిస్తే, విద్యా నిర్ణయాలు, ఆర్థిక మద్దతు మధ్య వైరుధ్యాలు లేదా సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది. ఉద్యోగుల పాత సంస్థల ఉద్యోగులను కొత్త కమిషన్‌లో విలీనం చేయడం, కొత్త వ్యవస్థను రూపొందించడం అనేది సున్నితమైన, సంక్లిష్టమైన పాలనాపరమైన సవాలుగా నిలుస్తుంది.వికసిత్ భారత్ శిక్షా అధిక్షణ్ బిల్లు భారతీయ ఉన్నత విద్యా రంగానికి ఒక కొత్త అధ్యాయాన్ని ప్రారంభించనుంది. ఇది ఎన్‌ఇపి 2020 ఆశయాలను కార్యరూపం దాల్చడానికి

## లంక,అసైన్డ్ భూముల సమస్యల పరిష్కారం

అమరావతి, ఇప్పటి వరకు లంక భూములు, అసైన్డ్ భూముల సమస్యలను పరిష్కరిస్తూ వస్తున్నట్లు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పుకొచ్చారు. పెండింగ్ ఉన్న 2శాతం రైతులకు కొన్ని సమస్యలు ఉన్నాయని.. వాటిని ఒక్కోటిగా పరిష్కరిస్తూ వస్తున్నామన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను జనవరి 1 నుంచి ప్రారంభించేందుకు సన్నహాలు చేస్తున్నామన్నారు. రాజధాని ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సీఆర్డీఏ కార్యాలయంలో త్రీ మెన్ కమిటీ నివారం సమీక్ష నిర్వహించింది. అనంతరం కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మీడియాతో మాట్లాడుతూ.. జరీబు భూ సమస్యలపై సర్వే పూర్తయిందన్నారు. జరీబు భూములపై న్యాయంగా ఎవరికి ఇవ్వాలి అనేదానిపై కమిటీ రిపోర్ట్ తర్వాత నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. పది సెంట్లు కంటే తక్కువ ప్లాట్లు ఉన్నవాళ్లు 415 మంది ఉన్నారని... వారి సమస్యలు కూడా పరిష్కరిస్తున్నామన్నారు. 2013 కంటే ముందు భూములు ఇచ్చిన రైతులు కూడా తమను ల్యాండ్ పూలింగ్ కింద పరిగణించమని అడుగుతున్నారని... కానీ అవి చట్టపరంగా సాధ్యం కావడం లేదని కేంద్రమంత్రి అన్నారు. వీధి పోటు భూములకు సంబంధించి సుమారు 150 ఉన్నాయని.. వీధి పోటుకు సంబంధించి మరో రెండు అంశాలు రైతుల కోరుతున్నారని. ఆ అంశాలను తర్వాత పరిగణిస్తామని స్పష్టం చేశారు. త్రీ మెన్ కమిటీ నిర్ణయం ప్రకారం తిరిగి లంక భూముల విషయంలో 356కు గాను 79 మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని చెప్పారు. మిగిలిన వారిని కూడా రిజిస్ట్రేషన్ చేయించుకోమని కోరారు. గన్నవరం ఎయిర్‌పోర్ట్ సమస్యలపై కూడా ఈ రివ్యూలో చర్చించినట్లు తెలిపారు. లార్జ్ రిటర్నబుల్ ఎ÷-లాట్స్ విషయంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని.. పరిష్కారం దిశగా వర్క్ చేస్తున్నామన్నారు. హెల్త్ కార్డ్స్, పెన్షన్లు తదితర అంశాలపై కూడా చర్చించినట్లు చెప్పారు. స్థానికంగా 1596 మందిని క్యాపిటల్ వర్క్‌లో అధికారులు జాయిన్ చేసుకున్నారని.. ఇవి కాకుండా మరో 10 వేల మందిని రాజధానిలో ఉండే స్థానికులను కలిపే విధంగా ప్రయత్నిస్తున్నామని అన్నారు. ప్రతి గ్రామంలో కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ అన్నారు. రోడ్ల నిర్మాణలు, భారీ వాహనాల రాకపోకల వల్ల కొన్ని చోట్ల స్మశాన ప్రాంతాలు ఇబ్బందికరంగా మారుతున్నాయన్నారు. మల్కాపురం, వెంకటాపురం గ్రామాల్లో స్మశానాలు లేవని... అలాగే మరికొన్ని ప్రాంతాల్లో బరెల గ్రౌండ్ ఏర్పాటు చేయాలని చెప్పామన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో నాలుగు వేలకు పైగా పెన్షన్లను రిజెక్ట్ చేశారని.. ఎవరెవరికి పెన్షన్లు మిస్ అయ్యాయో వాటి వివరాలు సేకరిస్తున్నామన్నారు. అలాగే కొత్తగా పెళ్లయిన వారికి కూడా పెన్షన్లు అందజేయాలని చూస్తున్నామని చెప్పారు. అమరావతిలో భూమి ఇచ్చిన వారికి బిలో పావర్టీ లైన్ తో సంబంధం లేకుండా అందరికీ హెల్త్ కార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. నిన్న జరిగిన ఒక గ్రామ సభలో మాట్లాడుతూ ఉండగా రైతు రామారావు అకస్మాత్తుగా మరణించడం జరిగిందన్నారు. ఆ రైతుకు ఐదు ఎకరాల భూమి ఉందని... సభలో కూడా రామారావు మాట్లాడుతూ తమకు అందించే భూమి ఎక్కడ వస్తుందో స్పష్టంగా చెప్పాలని అడిగారన్నారు. చాలా వివరంగా, ఆయన మామూలుగా మాట్లాడుతూ ఉండగా అనుకోకుండా జరిగిన ఘటనను కొన్ని పత్రికలు, వైసీపీ నాయకులు శవాల మీద రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఏమీ లేని చోట ఇలాంటి దుష్ప్రచారాన్ని చేయడం మానుకోవాలని ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

## ప్రజాస్వామ్యం, రాజ్యాంగానికి తీవ్ర ముప్పు

న్యూఢిల్లీ,దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని, ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మోదీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం రద్దుతో కోట్లాది పేదలకు ఉపాధి కరువవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో ఖర్గే పలు కీలక అంశాలపై మాట్లాడారు. నరేగా రద్దును మహాత్మాగాంధీకి అవమానంగా, 'రైట్ టు వర్క్'పై మోదీ సర్కార్ క్రూర దాడిగా ఖర్గే అభివర్ణించారు. 'పేదల కడుపుపై తన్నిన మోదీ ప్రభుత్వం... పేదల కంటే కార్పొరేట్ల లాభాలే ముఖ్యం' అని ఖర్గే విమర్శించారు. ఐఖం హయాంలో అమలైన హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. 2006లో ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన ఈ పథకం గ్రామీణ భారత ముఖచిత్రాన్ని మార్చిందని, దళితులు, ఆదివాసీలు, మహిళలకు భరోసా ఇచ్చిందని, పేదరికం నుంచి బయటపడ్డ తరాన్ని సృష్టించిందని ఖర్గే చెప్పుకొచ్చారు. ఎలాంటి అధ్యయనం లేకుండా రద్దు చేశారని మండిపడ్డారు. మూడు నల్ల వ్యవసాయ చట్టాల తరహాలోనేనని, రైతు ఉద్యమంలా దేశవ్యాప్త పోరాటం అవసరమని పిలుపునిచ్చారు. ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. ఓఉఔఖీఇఉంపై కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సభ్యులకు ఖర్గే సూచించారు.కాంగ్రెస్ 'సంస్థా సృజన అభియాన్'ను కొనసాగిస్తామని ఖర్గే తెలిపారు. 500 జిల్లాల్లో జిల్లా అధ్యక్షుల నియామకం పూర్తయిందని, బూత్ స్థాయి వరకూ పార్టీని బలోపేతం చేస్తున్నామని ఖర్గే చెప్పారు. 2026 ఎన్నికలకు కాంగ్రెస్ సిద్ధమని ఆయన ప్రకటించారు.

## ఆర్ఎస్ఎస్‌పై తన పోరాటం కొనసాగుతుంది

విశాఖపట్నం,బీజేపీని పెంచి పోషిస్తున్న ఆర్ఎస్ఎస్‌తో మనం పోరాటం చేయాలని ప్రముఖ సినీనటుడు ప్రకాశ్‌రాజ్ వ్యాఖ్యానించారు. మనం లేకపోయినా ఏదో ఒక రోజు కూకటి వేళ్లతో సైతం ఆర్ఎస్ఎస్‌ను పేకలించాలని హెచ్చరించారు. తాను సాంస్కృతికంగా ఆర్ఎస్ఎస్‌పై పోరాటం చేస్తానని పేర్కొన్నారు. భారతదేశంలో కనిపించని బ్రహ్మ రాక్షసుడు ఉన్నారని విమర్శించారు. కమలం పార్టీతో తాను పోరాడుతున్నానని.. తన పోరాటం ఆగదని పేర్కొన్నారు. శనివారం విశాఖపట్నంలోని ఏయూ గ్రౌండ్‌లో శ్రామిక ఉత్సవ్ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు ప్రకాశ్‌రాజ్. సీఐటీయూకి తనకు అనుబంధం చాలా ఏళ్ల నుంచి ఉందని గుర్తుచేసుకున్నారు. వీధి నాటకాల నుంచే తన ప్రయాణం ప్రారంభమైందని ప్రస్తావించారు. అబద్ధం మాట్లాడటానికి ధైర్యం ఉండాలని.. నిజం మాట్లాడటానికి కాదని చెప్పుకొచ్చారు. ఈరోజు రైతుల గుండెల మీద ఆయా ప్రభుత్వాలు బిజినెస్‌మెన్‌లను కూర్చొబెడుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వాలు అన్నదాతల కనీస సమస్యలు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. ఈరోజు ప్రజల గొంతుగా మారి తాను మాట్లాడుతున్నానని చెప్పుకొచ్చారు ప్రకాశ్‌రాజ్.మన ప్రభుత్వాలు అమ్ముడు పోయాయని ఆరోపణలు చేశారు. రాజకీయ నేతలు మనువాదాన్ని అమలు చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. చమట చుక్కకు ఓటమి లేదని.. ప్రస్తుతం

# కెసిఆర్ సరే జగన్ పరిస్థితి ఏంటి?



హైదరాబాద్, తెలంగాణ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాలని మాజీ సీఎం కెసిఆర్ నిర్ణయం తీసుకున్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన రెండేళ్ల తర్వాత ఆయన సభలోకి ఎంట్రీ ఇవ్వనున్నారు. కెసిఆర్ తీసుకున్న ఈ నిర్ణయం పై తెలంగాణ సమాజం హర్షం వ్యక్తం చేస్తోంది. ప్రజలు ఎన్నుకున్నదే చట్టసభల్లో తమ వాణిని వినిపించాలని.. కానీ పాలకులు ఆ ప్రయత్నం చేయడం లేదు. అయితే తన స్నేహితుడు కేసీఆర్ హాజరవుతుండడంతో.. ఆ ప్రభావం ఏపీ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి పై ఖచ్చితంగా పడుతుంది. ఎందుకంటే జగన్ సైతం సభకు హాజరు కావడం లేదు. తనకు ప్రతిపక్ష నేత హొదా ఇస్తేనే సభకు హాజరవుతానంటూ తేల్చి చెబుతున్నారు.

అనివార్య పరిస్థితుల్లో..

తెలంగాణలో కెసిఆర్ పార్టీకి 36 సీట్లు వచ్చాయి. నిబంధనల ప్రకారం అసెంబ్లీ సీట్లలో 10% స్థానాలు వస్తేనే వారికి ప్రతిపక్ష హొదా దక్కేది. కెసిఆర్ పార్టీకి గౌరవప్రదమైన స్థానాలు రావడంతో ఆ పార్టీకి ప్రతిపక్ష హొదా దక్కింది. అయితే కెసిఆర్ సైతం కేవలం ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసేందుకు మాత్రమే సభకు వచ్చారు. తర్వాత అదిగో ఇదిగో అంటూ కాలయాపన జరుగుతూ వచ్చింది. సవాళ్లు చేస్తూ సభకు రావడం మానేశారు కెసిఆర్.. అయితే ఇప్పుడు రేవంత్ రెడ్డిని సభలో ఇరకాటంలో పెట్టకపోతే ప్రజలు నమ్మరని కెసిఆర్ ఒక నిర్ణయానికి వచ్చారు. ఈరోజు నుంచి సభకు హాజరయ్యేందుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. సభలోనే సీఎం రేవంత్ ను ఓ స్థాయిలో నిలదీసేందుకు గట్టి ప్రయత్నమే చేస్తున్నట్లు సమాచారం.

రాజకీయ మిత్రులు..

ఎంత కాదనుకున్నా.. కెసిఆర్ జగన్మోహన్ రెడ్డికి అత్యంత మిత్రుడు. పరస్పర రాజకీయ ప్రయోజనాలతో ఇద్దరు అడుగులు వేసిన వారే. ఈ ఇద్దరు నేతలు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులుగా వ్యవహరించిన వారే. ఏది చేసినా కలిసే చేసేవారు. చివరకు యజ్ఞాలు యాగాలు విషయంలో కూడా కెసిఆర్ ను అనుసరించే వారు జగన్. అందుకే ఇప్పుడు కెసిఆర్ శాసనసభకు హాజరవుతుండడంతో.. జగన్ హాజరవుతారా? లేదా? అని ఎక్కువ మంది ప్రశ్నిస్తున్నారు. తప్పకుండా ఏపీలో దీనిపై చర్చ నడుస్తుంది. ఎందుకంటే వారిద్దరి మధ్య ఉన్న బంధం అటువంటిది. అయితే తనకు ప్రతిపక్ష హొదా ఇవ్వనిదే సభలో అడుగు పెట్టను అని మారం చేస్తున్నారు జగన్ మోహన్ రెడ్డి. ఈ విషయంలో పార్టీ నుంచి కూడా ఒత్తిడి ఎదురయ్యే అవకాశం ఉంది. కచ్చితంగా రాజకీయ ప్రత్యర్థులు దీనిని ఒక ప్రచార అస్త్రంగా కూడా మార్చుకుంటారు. అయితే సభకు హాజరైతే ఏ పరిస్థితులు ఎదురవుతాయో జగన్మోహన్ రెడ్డికి తెలుసు. కెసిఆర్ మాదిరిగా జగన్ కౌంటర్ ఇచ్చే పొజిషన్లో లేరు. అందుకే జగన్ హాజరు విషయంలో మరిచిపోవడమే ఉత్తమమని ఎక్కువమంది అభిప్రాయపడుతున్నారు.

# మోడీ మన్ కీ బాత్ లో నరసాపురం టాపిక్.. స్పెషల్ ఇదే!



న్యూఢిల్లీ,ప్రధాని నరేంద్ర మోడీ ప్రతిష్టాత్మక కార్యక్రమం మన్ కీ బాత్ 129వ ఎపిసోడ్ లో తాజాగా ప్రసంగించారు. ఈ ఏడాది చివరి మన్ కీ బాత్ అయిన ఈ కార్యక్రమంలో ఈ ఏడాదిలో భారత్ సాధించిన విజయాలను, గర్వించదగిన క్షణాలను గుర్తు చేసుకున్నారు. ఇందులో భాగంగా.. ఆపరేషన్ సిందూర్ నుంచి మహా కుంభమేళా వరకూ అన్ని విషయాలనూ ప్రస్తావిస్తూ.. నరసాపురం టాపిక్ కూడా ఎత్తడం గమనార్హం.అవును... ఈ ఏడాది చివరి మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఈ ఏడాదిలో దేశం సాధించిన విజయాలను గుర్తు చేసుకున్నారు. ఇందులో భాగంగా... ఆపరేషన్ సిందూర్ తో భారత్ ప్రపంచ దేశాలకు తన బలాన్ని చూపించిందని.. దేశ భద్రతపట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని.. ప్రతిపౌరుడికి గర్వకారణంగా మారిందని అన్నారు.ఇదే సమయంలో... 12 ఏళ్ల తర్వాత పురుషుల క్రికెట్ జట్టు ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని సొంతం చేసుకోగా.. మొదటిసారి మహిళల క్రికెట్ జట్టు వన్డే ప్రపంచ కప్ ను గెలుచుకుందని.. మహిళల అంధుల జట్టు టీ20 ప్రపంచ కప్ ను గెలుచుకొని చరిత్ర సృష్టించిందని మోడీ గుర్తు చేసుకున్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించిన శుభాన్షు శుక్లాను ప్రశంసించారు.ఇదే క్రమంలో... కోట్లాది మంది పాల్గొన్న మహా కుంభమేళాను.. అయోధ్య రామాలయంలో జరిగిన ధ్వజారోహణ కార్యక్రమాన్ని.. ఈ ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన అనేక పథకాలను గుర్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం ప్రస్థావన తెచ్చారు. అందుకు కారణం... ఇక్కడున్న లేస్ క్రాఫ్ట్ కావడం గమనార్హం!ఈ సందర్భంగా... నరసాపురం లేస్ క్రాఫ్ట్ గురించి ప్రస్థావించిన ప్రధాని మోడీ.. ప్రస్తుత మార్కెట్ లో ఆంధ్రప్రదేశ్ లోని నరసాపురం లేస్ క్రాఫ్ట్ చర్చనీయాంశంగా మారిందని అన్నారు. తరతరాల నుంచి మహిళలే ఈ అరుదైన కళను కాపాడుతూ వస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో.. ఏపీ ప్రభుత్వం నాబార్డ్ తో కలిసి ఎంతో ప్రోత్సహిస్తుందని.. ప్రస్తుతం దీని మార్కెట్ వేగంగా విస్తరిస్తోందని తెలిపారు.

మోడీకి లోకేష్ కృతజ్ఞులు!:

ఈ ఏడాది చివరి మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రత్యేకంగా నరసాపురం లేస్ క్రాఫ్ట్ గురించి మాట్లాడుతూ.. దానికి ప్రత్యేక గుర్తింపు ఇవ్వడంపై ఏపీ మంత్రి నారా లోకేష్ స్పందించారు. ఇందులో భాగంగా... ప్రధానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నరసాపురం లేస్ కళలోని శాశ్వత సౌందర్యాన్ని, దాని వెనుక ఉన్న శ్రమను ప్రధాని గౌరవించడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ లేస్ క్రాఫ్ట్ ద్వారా లక్షకు పైగా మహిళలు జీవనోపాధి పొందుతున్నారని.. నాబార్డ్, స్కిల్ డెవలప్మెంట్ తో దీన్ని మరింత ప్రోత్సహిస్తామని తెలిపారు!

# మనిషిలా మాట్లాడే ఏఐలకు చైనా 'బ్రేక్'!



హైదరాబాద్, మీతో స్నేహితుడిలా మాట్లాడే, మీ భావోద్వేగాలను పంచుకునే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సేవలు ఈ మధ్యకాలంలో బాగా ప్రాచుర్యం పొందుతున్నాయి. అయితే, ఈ సాంకేతికత వెనుక ఉన్న నైతిక, భద్రతాపరమైన ప్రమాదాలపై చైనా ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. మనుషుల్లా నటించే, భావోద్వేగాలతో బంధం పెంచుకునే ఏఐ సేవలపై కఠినమైన నియంత్రణలు విధిస్తూ, అక్కడి సైబర్ రెగ్యులేటరీ అథారిటీ ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. అసలు చైనా ఎందుకింత కఠినంగా వ్యవహరిస్తోంది? ఈ కొత్త నిబంధనల వెనుక ఉన్న ఆంతర్యమేంటి?కృత్రిమ మేధ రంగంలో దూసుకుపోతున్న చైనా, దాని వినియోగంపై కూడా అంతే కఠినంగా వ్యవహరి స్తోంది. శనివారం, చైనా సైబర్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ , మానవ వ్యక్తిత్వాలను అనుకరించే ఏఐ సేవలపై కొత్త ముసాయిదా నిబంధనలను ప్రజల అభిప్రాయం కోసం విడుదల చేసింది. ఈ సేవలు వినియోగదారులతో మానసికంగా, భావోద్వేగ పరంగా మమేకమయ్యే ప్రయత్నం చేస్తున్న నేపథ్యంలో, వాటిపై పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.కొత్త నిబంధనల లక్ష్యం.. 'డిజిటల్ కళ్లెం' : వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని వేగంగా విస్తరిస్తున్న ఏఐ రంగంలో భద్రత, నైతికతకు పెద్దపీట వేయడమే ఈ కొత్త నిబంధనల ప్రధాన లక్ష్యం. బీజింగ్ ప్రభుత్వం, ఈ రంగంపై తన పట్టును నిలుపుకుంటూ, దానిని సరైన మార్గంలో నడిపించాలని చూస్తోంది. ఈ ముసాయి దా నిబంధనలు, ఏఐ కంపెనీలకు ఓ 'డిజిటల్ కళ్లెం'లా పనిచేయనున్నా యి.ప్రభావం ఎలా ఉండనుంది? : ఈ కొత్త నిబంధనలు అమల్లోకి వస్తే, ఏఐ సేవలను అందించే కంపెనీలు అనేక భద్రతా, నైతిక ప్రమాణాలను పాటించాల్సి ఉంటుంది. వినియోగదారుల మానసిక ఆరోగ్యానికి హాని కలిగించేలా ఏఐ సేవలు ఉండకూడదు. భావోద్వేగాలతో ఆడుకుని, వారిని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయకూడదు. వినియోగదారుల వ్యక్తిగత డేటా భద్రతకు పూర్తి బాధ్యత వహించాలి.ఈ నిబంధనలు, చైనాలో వినియోగదారుల-కేంద్రీకృత ఏఐ సేవల భవిష్యత్తును నిర్దేశించనున్నాయి. సాంకేతిక ఆవిష్కరణలకు, నైతిక బాధ్యతలకు మధ్య సమతుల్యతను సాధించే దిశగా చైనా వేస్తున్న ఈ అడుగు, ప్రపంచవ్యాప్తంగా ఏఐ నియంత్రణపై జరుగుతున్న చర్చపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

# నిజమే.. ఇప్పుడు మారిపోయిన చంద్రబాబే!



అమరావతి,ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చాలా సందర్భాల్లో 'తాను ఇప్పుడు మారిపోయిన చంద్రబాబును' అని చెప్పుకుంటూ ఉంటారు. ఆయన చెప్పిన సందర్భాన్ని బట్టి.. అది నిజమో కాదో ప్రజలు ఎప్పటికప్పుడు నిర్ణయించుకుంటూ ఉంటారు.ప్రస్తుతం ఆయన అలాంటి డైలాగును ఎక్కడా వల్లించలేదు గానీ.. ఒక విషయంలో తాజా పరిణామాల్ని గమనిస్తే.. నిజమేనేమో ఆయన మారిపోయిన చంద్రబాబే అని ఎవ్వరికైనా అనిపించక మానదు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అయోధ్యలో రామాలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చెప్పిన మాటలు, ఆయన పట్ల ప్రజలు తమ అభిప్రాయాలను మార్చుకునే విధంగా ఉన్నాయి.అత్యుత్తమ పరిపాలనకు రామరాజ్యమే కొలమానం అని, అయోధ్యలో శ్రీరాముడిని దర్శించుకోవడం తనకు కొత్త శక్తిని ఇచ్చిందని చంద్రబాబు అక్కడ చెప్పారు. రాముడు పాటించిన విలువలు కాలానికి అతీతంగా స్ఫూర్తినిస్తుంటాయని, సుపరిపాలనకు మార్గదర్శకంగా నిలుస్తాయని కూడా అన్నారు.రాముడి పాలన ఏ రకంగా గొప్పదో, రాముడు అనుసరించిన ఏ పరిపాలన విధానాలను తాను అమలు చేయబోతున్నాడో ఆయన దృష్టాంతాలేమీ చెప్పలేదు. ఏదో జనాంతికంగా అందరూ అంటున్నట్టుగా రామరాజ్యం గొప్పది అని కీర్తించారు. ఇంతవరకు పరవాలేదు. రాముడి గుడికి వెళ్లిన ఏ రాజకీయ నాయకుడైనా ఇలాంటి మాటలు వల్లిస్తారు. కానీ.. ఆయన చెప్పిన మరికొన్ని మాటలు.. ఆయన సహజశైలికి విరుద్ధమైనవి.'అయోధ్య రామమందిరం మన సంస్కృతికి ప్రతీక. ఎన్నో వివాదాల తర్వాత ఆలయం నిర్మితమైంది. దేశ ప్రజల కల సాకారమైంది' లాంటి అచ్చమైన హిందూత్వవాదుల మాటలను చంద్రబాబు కూడా ఇక్కడ పునరుద్ఘాటించారు. సాధారణంగా చంద్రబాబు.. ఒక ప్రొఫెషనల్ రాజకీయనాయకుడిగా ఎవ్వరినీ నొప్పించడానికి ప్రయత్నించారు.ఏపీలో కూడా గణనీయంగా ఉండే ముస్లిం వర్గాన్ని నొప్పించే మాట పొరబాటున కూడా చెప్పరు. రాష్ట్ర విభజన డిమాండ్ జోరుగా ఉన్న రోజుల్లో రెండు కళ్ల సిద్ధాంతం పేరుతో గోడమీద వాటం ప్రదర్శించింది కూడా ఈ లక్షణం కారణంగానే. అలాంటి నేపథ్యంలో.. అయోధ్యరామాలయ నిర్మాణంతో దేశ ప్రజల కల సాకారమైంది.. వంటి మాటలతో ముస్లింవర్గాన్ని బాధ పెట్టే మాటలు మాట్లాడతారని చంద్రబాబునుంచి ఎవ్వరూ ఊహించరు. ఏపీ ముస్లిముల్లో ఆ పార్టీకి గట్టి ఓటు బ్యాంకే ఉంది. ఇప్పుడు ఆ ఓటు బ్యాంకును దూరం చేసుకోవడానికి కూడా ఆయన వెనుకాడడం లేదా అనే అనుమానం కలుగుతోంది.దేశవ్యాప్తంగా మారుతున్న రాజకీయ వాతావరణంలో.. హిందూత్వ వాదం రాజకీయ పరిణామాలను శాసించగల స్థితికి చేరుకుంటోంది. మోడీ మూడోసారి సాధించిన విజయం మాత్రమే ఇందుకు నిదర్శనం కాదు. మరోసారి కూడా మోడీ సర్కారును అడ్డుకోగలగడం సాధ్యం కాదనిపించేలా పరిణామాలు దేశమంతటా కనిపిస్తున్నాయి.హిందూత్వ ఎజెండాతో రూపొందే సినిమాలు క్రేజీగా హిట్ అవుతున్నాయి. ఆ రంగు పులుముకున్న వ్యాపారాలు కూడా రాణిస్తున్నాయి. ఇలా దేశ ప్రజల్లో హిందూత్వ వాదం.. తెలియకుండానే చాలా బలంగా వేళ్లూనుకుంటున్న నేపథ్యంలో.. ఇక రాజకీయ అవసరాల కోసం, ఓటు బ్యాంకు కోసం మధ్యేమార్గం అనుసరించడం అనవసరం అని చంద్రబాబు డిసైడ్ అవుతున్నారా? అని ప్రజలకు అనిపిస్తోంది.ఆయన పార్ట్నర్ పవన్ కల్యాణ్.. చాలా కాలంగా ముస్లిం ఓటు బ్యాంకు తనకు అక్కర్లేదన్నట్టుగానే.. హిందూత్వ వాదనను భుజాన మోస్తున్నారు. అదే బెటర్ మార్గం అని తాజాగా చంద్రబాబు కూడా ఫిక్సయినట్టుంది. ఇలాంటి తీరు గమనించినప్పుడు.. ఖచ్చితంగా ఆయన మారిపోయిన చంద్రబాబే అనిపిస్తుంది మరి!

# పొరుగు దేశం భారీ యుద్ధ విన్యాశాలు.. భీకర యుద్ధం జరగబోతుందా..!



న్యూఢిల్లీ,ఇప్పటికే ఈ ప్రపంచంలో మూడు ఘర్షణలు, ఆరు యుద్ధాలు, కాల్పుల మోతలు, అణ్వాయుధ పరీక్షల ఆందోళనలు నెలకొన్న వేళ.. మరో వైపు 2026లో మూడు ప్రపంచ యుద్ధానికి అవకాశాలున్నాయని బాబా వంగ, నోస్ట్రడమస్ లాంటి వారి అంచనాలు హల్ చల్ చేస్తోన్న వేళ.. తాజాగా ఓ సంచలన విషయం తెరపైకి వచ్చింది. ఇందులో భాగంగా.. తైవాన్ ను చుట్టుముట్టి భారీ ఎత్తున యుద్ధ విన్యాసాలు చేయనున్నట్లు చైనా ప్రకటించింది. జపాన్ చేసిన వ్యాఖ్యలు వైరల్ గా మారాయి.అవును... తైవాన్ చుట్టూ ఉమ్మడి సైనిక విన్యాసాలు నిర్వహించడానికి వైమానిక, నౌకాదళ, రాకెట్ దళాలను పంపుతున్నట్లు చైనా సైన్యం సోమవారం తెలిపింది. ఈ చర్యను వేర్పాటువాద, బాహ్య జోక్యం శక్తులకు వ్యెరేకంగా కఠినమైన హెచ్చరిక అని అభివర్ణించింది. ఈ సందర్భంగా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ ఈస్టర్న్ థియేటర్ కమాండ్ ప్రతినిధి సీనియర్ కల్నల్ షి యీ స్పందిస్తూ.. ఈ విన్యాసాలు "జస్టిస్ మిషన్ - 2025" పేరిట చేయనున్నట్లు ప్రకటించారు.ఇందులో భాగంగా... ఈ మిషన్ పేరిట తైవాన్ జలసంధిలో యుద్ధ విన్యాసాలు చేయనున్నట్లు ప్రకటించారు. సముద్ర, గగనతల యుద్ధ సన్నద్ధతను పరీక్షించుకోవడం, ద్వీప సమూహాల బయట బ్లాకేడ్స్ నిర్వహించడం వంటివి చేయనున్నట్లు తెలిపారు. ప్రధానంగా... తైవాన్ లోని వేర్పాటువాద శక్తులకు ఇది బలమైన హెచ్చరిక అని.. జాతీయ సమైక్యత, సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి చైనా తగిన చర్యలు తీసుకొంటుందని అన్నారు.మరోవైపు ఈ విషయంపై స్పందించిన జపాన్ ప్రధాన మంత్రి సనే తకైచి... తైవాన్ ను రక్షించేందుకు అవసరమైతే తాము రంగంలోకి దిగుతామని ప్రకటించారు. తైవాన్ తన పాలనలోకి రావాలని ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కోరుకుంటుందని.. ఈ క్రమంలో స్వయం పాలన ద్వీపమైన తైవాన్ పై చైనా చర్య తీసుకుంటే తమ సైన్యం జోక్యం చేసుకోవచ్చని అన్నారు. ఈ ప్రకటన నేపథ్యంలోనే చైనా అలర్ట్ అయ్యి, సైనిక విన్యాసాలు షురూ చేసిందని చెబుతున్నారు.పైగా... తైవాన్ కు సుమారు 10 బిలియన్ డాలర్లకు పైగా విలువైన పెద్ద ఎత్తున ఆయుధ అమ్మకాలను వాషింగ్టన్ ప్రకటించింది. ఆ ప్రకటన వచ్చిన వారం రోజుల తర్వాత బీజింగ్ గత వారం 20 అమెరికా రక్షణ సంబంధిత కంపెనీలు, 10 కార్యనిర్వాహకులపై ఆంక్షలు విధించింది.ఈ పరిణామాల నేపథ్యంలో తైవాన్ అధ్యక్షుడి కార్యాలయ ప్రతినిధి కురెన్ కువో స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇందులో భాగంగా... తైవాన్ జలసంధి, ఇండో-పసిఫిక్ ప్రాంత స్థిరత్వం, భద్రతను ఈ ఆపరేషన్ దెబ్బతీస్తోందని.. అంతర్జాతీయ శాంతిభద్రతలను బహిరంగంగా సవాలు చేస్తోందని అన్నారు. ఈ సందర్భంగా... చైనా తాజా చర్యను తమ దేశం తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు.కాగా... 1949లో జరిగిన అంతర్యుద్ధం కారణంగా బీజింగ్ లో కమ్యునిస్టు పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చైనా, తైవాన్ లు విడివిడిగా పరిపాలించబడుతున్నాయి. ఈ సమయంలో ఓడిపోయిన నేషనలిస్ట్ పార్టీ దళాలు తైవాన్ కు పారిపోయాయి. అప్పటి నుంచి ఈ ద్వీపం దాని స్వంత ప్రభుత్వ పాలనలోనే ఉంది!

# కొడాలి నాని రీ ఎంట్రీ...కూటమి రియాక్షన్ అదే!



అమరావతి,మాజీ మంత్రి కొడాలి నాని వైసీపీలో యాక్టివ్ అయ్యేందుకు నిర్ణయించుకున్నారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన రాజకీయాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. మొన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీల అంశానికి సంబంధించిన కోటి సంతకాల సేకరణకు హాజరయ్యారు. మరోసారి జగన్మోహన్రెడ్డిని ముఖ్యమంత్రి చేసేందుకు కృషి చేస్తానని చెప్పుకొచ్చారు. తద్వారా తాను రాజకీయాలకు విడిచిపెట్టి వెళ్ళబోనని సంకేతాలు ఇచ్చారు. అయితే ఇప్పుడు పూర్తిస్థాయిలో గుడివాడ నియోజకవర్గం పై కొడాలి నాని దృష్టి పెడతారని తెలుస్తోంది. సంక్రాంతి తర్వాత నియోజకవర్గంలో యాక్టివ్ అయ్యేందుకు ఆయన నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అదే సమయంలో కూటమి ప్రభుత్వం ఎలా పావులు కదుపుతుంది అనేది కూడా హాట్ టాపిక్ అవుతోంది. నాని యాక్టివ్ అయిన మరుక్షణం అరెస్ట్ ఉంటుందని ప్రచారంలో ఉంది.

దూకుడుకు మూల్యం తప్పదా?

కొడాలి నాని చాలా దూకుడు కలిగిన నాయకుడు. అయితే అది రాజకీయంగా కంటే వ్యక్తిగతంగానే. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో మంత్రిగా ఉన్నప్పుడు కన్ను మిన్ను కాన రాలేదు. చంద్రబాబుతో పాటు లోకేష్ పై నిత్యం అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వచ్చారు. నోటి నుంచి వచ్చే ప్రతి మాట తూటా కంటే డేంజర్ గా ఉండేది. సొంత పార్టీ వారు ఎంతగానో ఆనందం పొందే వారు. కానీ ప్రత్యర్థులు మాత్రం బూతులుగా చూసేవారు. తటస్తులతోపాటు విద్యాధికులు తప్పుపట్టేవారు. మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటమికి కొడాలి నాని లాంటి వారు చేసిన వ్యాఖ్యలు కారణమన్న కామెంట్స్ వినిపించాయి. అందుకే ఈసారి కొడాలి నాని కి జగన్ మోహన్ రెడ్డి ప్రాధాన్యం ఇవ్వరని ప్రచారం నడిచింది. మరోవైపు కొడాలి నాని కి ప్రత్యామ్నాయంగా మరో నేతను రంగంలోకి దించుతారని కూడా టాక్ నడిచింది.

ఎదురుచూస్తున్న టిడిపి శ్రేణులు..

కొడాలి నాని అరెస్ట్ కోసం టిడిపి శ్రేణులు ఆశగా ఎదురు చూస్తున్నాయి. గతంలో లోకేష్ ఇదే కొడాలి నానిని ఉద్దేశించి.. అరెస్ట్ చేసి రోడ్డుమీద తీసుకెళ్తామని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. కొడాలి నాని మాదిరిగా వ్యాఖ్యానాలు చేసే వల్లభనేని వంశీ మోహన్ అరెస్టు ఎప్పుడో జరిగిపోయింది. సుదీర్ఘకాలం ఆయన జైల్లోనే ఉండిపోయారు. ఆ వంతు కొడాలి నాని కి ఎప్పుడు వస్తుందా అని సగటు టిడిపి అభిమాని ఎదురుచూస్తూ వచ్చారు. అయితే కొద్ది రోజుల కిందట గుండెపోటుకు గురయ్యారు కొడాలి. ముంబాయిలోని ప్రఖ్యాత ఆసుపత్రిలో బైపాస్ సర్జరీ చేసుకున్నారు. కొద్ది రోజులు విశ్రాంతి తీసుకోవాలని అక్కడి వైద్యులు సూచించారు. అందుకే ఇంటికే పరిమితమయ్యారు కొడాలి నాని. కానీ ఇటీవల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోటి సంతకాల సేకరణ, జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలకు హాజరయ్యారు. సంక్రాంతి తర్వాత గుడివాడ నియోజకవర్గంలో యాక్టివ్ అవుతానని ప్రకటించారు. అయితే నాని యాక్టివ్ అయిన మరుక్షణం అరెస్టు చేసే అవకాశం ఉందని ప్రచారం నడుస్తోంది. అందుకే ఇదో హాట్ టాపిక్ గా మారింది.

# శ్రీవారి మెట్ల మార్గంలో ప్రాథమిక చికిత్స కేంద్రం



తిరుమల : ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి గోవింద నామస్మరణతో భక్తితో తిరుమలకు నడచుకుని వచ్చే యాత్రికుల సౌకర్యార్థం అలిపిరి నడకమార్గంలో ఏడోమైలు వద్ద ప్రాథమిక చికిత్సా కేంద్రాన్ని టిటిడి ఏర్పాటుచేసింది. అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన ఈ కేంద్రాన్ని ఆదివారం ఉదయం టిటిడి చైర్మన్ బిఆర్నాయుడు, టిటిడి ఇఒ అనిల్కుమార్ సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ప్రారంభించారు. నడకదారి భక్తుల సౌకర్యార్థం ఇక్కడ ప్రాథమిక చికిత్సా కేంద్రం నెలకొల్పడంతో అత్యవసర పరిస్థితుల్లో భక్తులు ఈ కేంద్రం వద్ద వైద్య సేవలను వినియోగించుకోవచ్చన్నారు. ఇప్పటికే శ్రీవారి మెట్టు మార్గంలో కూడా ప్రాథమిక చికిత్సా కేంద్రాన్ని ఏర్పాటుచేసినట్లు

తిరుమలలో వైద్య సౌకర్యాలను విస్తృతం చేయడంలో

టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి మాట్లాడుతూ తిరుమలలో వైద్య సౌకర్యాలను విస్తృతం చేయడంలో భాగంగా అలిపిరి నడక మార్గంలో ఆధునిక సౌకర్యాలతో ప్రాథమిక చికిత్సా కేంద్రం భక్తులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రతిరోజూ ఈ మార్గంలో 30వేల వరకు భక్తులు నడుచుకుంటూ వస్తారని తెలిపారు.

## దుర్గగుడికి కరెంట్ కట్ చేసిన అధికారులు

విజయవాడ, దేవాదాయ, విద్యుత్శాఖల మధ్య బకాయిల వివాదం విజయవాడ దుర్గమ్మ ఆలయానికి కొన్ని గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేతకు దారి తీసింది. సంబంధిత మంత్రుల చొరవతో సరఫరా పునరుద్ధరించారు. విద్యుత్ బిల్లుల బకాయిలు రూ.3.08కోట్లు చెల్లించలేదంటూ అధికారులు ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం విజయవాడ ఇంద్రకీలాద్రికి విద్యుత్తు అధికారులు సరఫరా నిలిపి వేయడాన్ని మంత్రులు తీవ్రంగా పరిగణించారు. దీనిపై వెంటనే స్పందించిన దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి.. విద్యుత్శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్తో ఫోన్లో మాట్లాడారు. సోమవారం తమశాఖ ఉన్నతాధికారులతో చర్చించి కొంత మొత్తం చెల్లించాలని దుర్గగుడి అధికారులు నిర్ణయించారు. ఇదే సమయంలో సోలార్ ప్లాంట్ నుంచి ఉత్పత్తి చేసి గ్రిడ్కు అనుసంధానిస్తున్న విద్యుత్తు యూనిట్ల లెక్కలు కూడా తేల్చాలని దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం అధికారులు గట్టిగా పట్టుబట్టనున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com